ఓనం.. సంస్కృతి గొప్పదనం


రంగు రంగుల పుష్పాలతో అందంగా తీర్చిదిద్దిన రంగవల్లి

తాళ్లపూడి, న్యూస్‌టుడే : భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ సంస్కృతి గొప్పదనాన్ని చాటిచెప్పేలా ఓనం పండగ వంటివి దోహదపడతాయని కొవ్వూరు హోలీ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ నెల్సన్ ఆంటోని అన్నారు. తాళ్లపూడి మాంటిస్సోరీ పాఠశాల ప్రాంగణంలో కేరళీట్స్ స్కూల్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఓనం వేడుకలు నిర్వహించారు. మాంటిస్సోరీ పాఠశాల కరస్పాండెంట్ అనీష్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు కేరళం సంప్రదాయ దుస్తులు ధరించి హాజరయ్యారు. పూలతో తీర్చిదిద్దిన రంగవల్లి అలంకరణ ఆకట్టుకుంది. ఓనం పండగ చరిత్ర, విశిష్టత, సంస్కృతి ప్రాధాన్యాన్ని ఆంటోనీ వివరించారు. కేరళీట్స్ స్కూల్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు, ఆయా పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి.. కొల్లగొట్టి..!


గోపాలపురం మండల పరిధిలోని రాంపాలెం సమీపంలో ఇటీవల తవ్విన పోలవరం కాలువ ఇది. పార్టీలతో సంబంధం లేకుండా యథేచ్ఛగా మట్టిని మాయం చేస్తున్నారు. కొంతమంది అధికార పార్టీ నేతల బంధువులకు చెందిన యంత్రాలతో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది.

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, గోపాలపురం, దేవరపల్లి : పట్టిసీమ ఎత్తిపోతలను యుద్ధప్రాతిపదికన నిర్మించారు.. పోలవరం కుడికాలువ (ఆర్‌ఎంసీ)ద్వారా లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తున్నారు.. కానీ కీలకమైన కాలువ గట్టును మట్టిమాఫియా మాయం చేస్తోంది. గత వైకాపా హయాంలో మొదలైన ఈ అక్రమాల జాతర ఇప్పుడు కూడా కొనసాగుతోంది.

అడ్డుకట్ట వేయరేం...

● కాలువ గట్టు వెంబడి రహదారి నిర్మించి, పోలవరం ప్రాజెక్టుకు కలిపే విధంగా ఆలోచనలు చేస్తుంటే.. మరోవైపు అందుబాటులో ఉన్న వనరులను ధ్వంసం చేసి సొమ్ము చేసుకునేందుకు కొందరు పాకులాడుతున్నారు. వీరికి స్థానికంగా కొందరి నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో మట్టి అక్రమ రవాణా పరిపాటిగా మారింది.

● దేవరపల్లి మండల పరిధిలో దేవరపల్లి, బంధపురం, ధుమంతెనగూడెం, యర్నగూడెం, కృష్ణపాలెం నుంచి చీకటి పడితే చాలు.. ట్రాక్టర్లు ఆర్‌ఎంసీ గట్టుపై పరుగులు పెడుతుంటాయి. ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.1,500 నుంచి రూ.2,500 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

● చెరుకుమిల్లి వద్ద సుమారు 30మీటర్ల ఎత్తు ఉండే మట్టి గుట్టను భూమికి సమాంతరంగా చేశారంటే పరిస్థితి అర్థమవుతోంది.

● గోపాలపురం నియోజకవర్గం మీదుగా ఉన్న తాడిపూడి, పోలవరం కుడి కాలువలు తవ్విన సమయంలో లక్షల టన్నుల మట్టి గుట్టలు కరిగిపోతున్నాయి. లే అవుట్లు వేయడానికి వినియోగిస్తున్నారు. కొందరైతే ప్రభుత్వ పని కోసం అనుమతి తీసుకుని బయట అమ్ముకుంటున్నారు.

● పోలవరం మండలం ప్రగడపల్లి నుంచి గోపాలపురం మండలం చెరుకుమిల్లి వరకు ఉన్న కాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.


● వేళ్లచింతలగూడెం, పెద్దాపురం, చెరుకుమిల్లి గ్రామాల్లో మట్టి వ్యాపారం సాగిస్తున్నారు.

● మట్టి అవసరాన్ని బట్టి లారీ రూ.5 వేలకు పైబగా అమ్మకాలు సాగిస్తున్నారు.

గోపాలపురం మండలం భీమోలు రహదారిని ఆనుకుని ఉన్న పోలవరం కాలువ గట్టు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ ఇది. ఈ ప్రాంతానికి సమీపంలోని తాడిపూడి, పోలవరం కుడి కాలువ గట్లపై అక్రమార్కుల కన్ను పడింది. గట్లను మాయం చేస్తున్నా.. యంత్రాంగం స్పందించని పరిస్థితి నెలకొంది.



అట్టహాసంగా కృష్ణబాబు విగ్రహావిష్కరణ



కొవ్వూరులో కృష్ణబాబు విగ్రహాన్ని ఆవిష్కరించిన శాసనసభ సభాపతి అయ్యన్నపాత్రుడు. చిత్రంలో ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, అచ్చిబాబు, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు కామినేని, ముప్పిడి, తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల, మాజీ ఎంపీ కేవీపీ, తదితరులు

వివరాలు 6లో...

ప్రశాంతంగా కడియపులంక నర్సరీ సంఘం ఎన్నికలు

● నూతన అధ్యక్షుడిగా బొరుసు సుబ్బారాయుడు



నూతన కార్యవర్గ సభ్యులతో అధ్యక్షుడు సుబ్బారాయుడు

కడియం, న్యూస్‌టుడే: కడియపులంక సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. సంఘం పెద్దలు, ఎన్నికల కమిటీల ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ మధ్యాహ్నం 2 గంటలతో ముగిసింది. నాగేశ్వరరావు, మణికుమార్ నేతృత్వంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి అభ్యర్థులు బొరుసు సుబ్బారాయుడు, రత్నం అయ్యప్ప పోటీపడ్డారు. మొత్తం 1,621 ఓట్లు పోలయ్యాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించారు.

356 ఓట్ల ఆధిక్యంతో విజయం..

సుబ్బారాయుడుకు 985 ఓట్లు, రత్నం అయ్యప్పకు 629 ఓట్లు వచ్చాయి. 356 ఓట్ల ఆధిక్యంతో సుబ్బారాయుడు నూతన అధ్యక్షుడిగా గెలుపొందారు. ఏడు ఓట్లు చెల్లనివిగా తేల్చారు. ● 3వ వార్డులో తలపడిన దూలం సత్యనారాయణమూర్తి తన ప్రత్యర్థి ఆకుల కిశోర్‌పై 85 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ● 7వ వార్డుకు జరిగిన పోటీలో పుల్లా శ్రీను 96 ఓట్ల ఆధిక్యంతో తన ప్రత్యర్థి మండెల కృష్ణపై విజయం సాధించారు. ● ఏకగ్రీవమైన వార్డు సభ్యులు కామిశెట్టి వెంకటేశ్ (1వ వార్డు), ఉండమట్ల అర్జున్(2), గట్టా కృష్ణ భగవాన్(4), సానా పల్లపు రాజు(5), డేగల రాము(6), బోడపాటి చంద్రశేఖర్(8), పాటంశెట్టి శ్రీనివాస్(9), తాడాల సత్యనారాయణ(10), అన్నందేవుల వెంకటేశ్వరరావు (బాబు)(11)లతో నూతన పాలకవర్గం కొలువుదీరింది. వారికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలిపారు.

సమన్వయ లోపం.. ఏదీ ఆరంభం..?

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: పుష్కరాలకు సంబంధించి అధికారుల్లో సమన్వయం కుదరట్లేదు ఇది ప్రజాప్రతినిధుల మాట. తాజాగా కేంద్ర పథకాలపై జిల్లా సమన్వయ, పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంపీ పురందేశ్వరితో పాటు జిల్లాలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తేల్చేశారు. యంత్రాంగంలో లోపం కారణంగా పనులు ముందుకు సాగట్లేదన్నారు. పుష్కర ఏర్పాట్లపై ఇప్పటికీ అంచనాకు రాకపోవడం అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారుల్లోనూ లోపంగా కనిపిస్తోంది.

కీలక పనుల ఆరంభమెప్పుడు..?

గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఘాట్‌లను సిద్ధం చేయాలి. ఆరు జిల్లాల్లో రూ.210కోట్లతో ఘాట్‌ల ఆధునికీకరణకు ఇరిగేషన్ శాఖ 238 పనులు తలపెట్టింది. వీటిలో కొత్తగా 4, 5 ఘాట్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. సెప్టెంబర్‌లో టెండర్లు ఖరారు చేస్తామని జిల్లా సమన్వయ సమావేశంలో అధికారులు వెల్లడించారు. ఇప్పుడు పనులు ప్రారంభిస్తే వచ్చే ఏడాది చివరికి అవుతాయని, పుష్కరాలు అయిపోతాయని ఎంపీ స్పష్టం చేశారు. కాతేరులో వీఐపీ ఘాట్ నిర్మాణానికి అడుగు పడలేదు. ఒక్క మునికూడలి ఘాట్ మాత్రమే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో విస్తరిస్తున్నారు. 26 ఘాట్‌లను ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియదు.

రహదారుల విస్తరణ లేక

రద్దీ నియంత్రణకు నగరాన్ని ఆనుకొని 26 రోడ్లను విస్తరించాలని ప్రతిపాదించారు. కనీసం ఆ రోడ్లలో ఆక్రమణలు కూడా తొలగించకపోవడం గమనార్హం. అంతర్గత రోడ్లు, ఘాట్‌లను ఆనుకొని ఉన్న అప్రోచ్ రోడ్లు వెడల్పు ఎప్పటికి పూర్తి చేస్తారో సరైన ప్రణాళిక లేదు.

కాలువల ఆధునికీకరణకు..

వర్షం పడితే నగరం ముంపు బారిన పడుతోంది. పుష్కరాలకు రూ.120 కోట్లతో కాలువల ఆధునికీకరణను గోదావరి తీరం వెంబడి ముంపు నివారణకు ప్రతిపాదించారు. ఇంకా టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాల్సి ఉంది.

● సీసీ కెమెరాల వ్యవస్థకు, మూడు కంట్రోల్ కేంద్రాలు నిర్మించేందుకు రూ.2కోట్లు విడుదలయ్యాయి. ఈ పనులు ఇంకా ప్రారంభించాలి. ఘాట్‌లు, రోడ్లు విస్తరిస్తే కానీ కెమెరాలు పెట్టలేని పరిస్థితి.

నేడు కలెక్టరేట్‌లో ‘పీజీఆర్ఎస్’

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే : జిల్లాలో ప్రజా, భూ సంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ వేదికగా ఫిర్యాదులు స్వీకరిస్తామని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు అందించాలని సూచించారు. రెవెన్యూ డివిజన్, మండల, స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు కార్యాలయాల్లోనూ అర్జీల స్వీకరణ ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా సేవలు పొందిన వారు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

బీమా.. రైతుకు ధీమా

● ప్రీమియం చెల్లింపునకు నేటితో గడువు పూర్తి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే : ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల కారణంగా పంట దెబ్బతింటే, ఆ సమయంలో రైతులు నష్టపోకుండా ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం (పీఎంఎఫ్‌బీవై) అమలు చేస్తోంది. ఈ పథకం ప్రీమియం చెల్లింపునకు నేటితో గడువు ముగియనుంది.

ఇదీ పరిస్థితి

● జిల్లాలో రైతులు ఖరీఫ్ వరిసాగు 94 వేల హెక్టార్లలో చేపట్టారు. 28,025 హెక్టార్లకు సంబంధించి ఫసల్ బీమా నమోదు చేయించాలని అధికారులు లక్ష్యం నిర్ణయించారు.

● ఆదివారం నాటికి 20,965 హెక్టార్లకు సంబంధించి 29,189 మంది రైతులు రూ.570 చొప్పున బీమా ప్రీమియం చెల్లించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

● సోమవారంతో గడువు ముగుస్తున్న నేపథ్యంలో మిగిలిన రైతులంతా ప్రీమియం చెల్లించాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు.

● రైతులు స్థానిక రైతుభరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను కలిస్తే బీమా నమోదు సమాచారం తెలియజేస్తారని, కౌలు రైతులైతే సీసీఆర్ కార్డు, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సులు తీసుకెళ్లి ఎకరాకు రూ.570 చొప్పున ప్రీమియం చెల్లించాలని డీఏవో సూచించారు.

● ప్రీమియం చెల్లించిన వారికి ఎకరాకు రూ.38 వేల చొప్పున పంటల బీమా వర్తిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లాలో లెక్క (హెక్టార్లలో..)

✦ ఖరీఫ్ వరిసాగు విస్తీర్ణం	94,000
✦ ఈ-పంట నమోదు	90,000
✦ ఫసల్ బీమా నమోదు లక్ష్యం	28,025
✦ ఇప్పటి వరకు పూర్తయింది	20,965
✦ ప్రీమియం చెల్లించిన రైతుల సంఖ్య	29,189

చిలుకల కనువిందు




కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరింగ పంచాయతీ పరిధిలోని చినబొడ్డువెంకటాయపాలెం జగనన్న కాలనీలోని ఆటోడ్రైవర్ వాడ్రేవు బాలకృష్ణ ఇల్లు చిలుకలకు ఆహార కేంద్రంగా మారింది. ఆయన ఏడాది క్రితం తన ఇంటిపై పిచ్చుకల కోసం ధాన్యం కుచ్చు కట్టారు. అయితే వాటి జాడ కనిపించ లేదు. కొద్ది రోజులకు రెండు రామచిలుకలు చేరాయి. నిత్యం ఆహారం అందుబాటులో ఉంచడంతో పదులు.. వందల సంఖ్యలో వస్తున్నాయి. బాలకృష్ణతో పాటు ఆయన భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు పిల్లలు రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల మధ్య, సాయంత్రం 6 గంటలకు ఇంటిపై ఆహారం సిద్ధం చేస్తుంటారు. తొలుత నెలకు 5 కేజీల ధాన్యం గింజలను ఆహారంగా పెట్టేవారమని, ప్రస్తుతం 20 కేజీలు అవసరం అవుతుందన్నారు. తమ వంతుగా నెలకు రూ.6 వేలు వెచ్చిస్తున్నామని, మిగిలిన ధాన్యం గింజలను కొందరు పక్షి ప్రేమికులు కొనుగోలు చేసి ఇస్తున్నారని బాలకృష్ణ చెప్పారు.

–న్యూస్‌టుడే, తాళ్లరేవు

తిరుమల తరహాలో వాడపల్లి క్షేత్రం అభివృద్ధి

● కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ


ఆహారం వండే పాత్రను ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, చిత్రంలో ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ తదితరులు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో శ్రీవకుళమాత అన్నదాన భవన ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన మాట్లాడారు. ఒకేసారి 3వేల మందికి భోజనాలు, రోజుకు సుమారు 40వేల మందికి ప్రసాదం సిద్ధం చేసేలా సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు.

☛ ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ.. ఆలయానికి సునాయసంగా చేరుకునేందుకు రూ.8 కోట్లతో రావులపాలెం నుంచి ఏటిగట్టు రహదారి అభివృద్ధి చేయనున్నామన్నారు. అన్నదాన భవనానికి పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.1.50 కోట్లు ఇచ్చారన్నారు. తణుకు, ఆచంట ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ, ఆలయ కమిటీ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంత కుమారి, కూటమి నాయకులు రామకృష్ణ, బండారు శ్రీనివాస్, భాజపా జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామరాజు పాల్గొన్నారు.

పొల్లూరు.. పర్యాటక హుషారు

మన్యంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పొల్లూరు జలపాతం కళకళలాడుతోంది. ఆదివారం తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. యువతీ, యువకులు పర్యాటక ప్రాంతాలను వర్షంలో తడుస్తూ తిలకించారు. ఇరుముడి సినిమా చిత్రీకరణకు నిర్మించిన చెక్కల వంతెనపై నుంచి జలపాత అందాలను సెల్‌ఫోన్లో బంధించారు.



– న్యూస్‌టుడే, మోతుగూడెం

రక్తదానం అభినందనీయం



దేవరపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. దేవరపల్లిలోని బీహెచ్ఎస్ఆర్-వీఎల్ఎం డిగ్రీ కళాశాలలో ఆదివారం జనసేన ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, జన సైనికుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, రాజానగరం, తాడేపల్లి గూడెం ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు పాల్గొన్నారు. రక్తదాన శిబిరాన్ని పరిశీలించి రక్తదాతలకు పండ్లు అందజేశారు. రక్తదానం చేసిన సుమారు 200 మంది జనసైనికులకు జ్ఞాపికలు సత్కరించారు. కాట్నం గణేష్, కొండపల్లి రమేష్, అచ్యుత సత్యనారాయణ, చొడసాని బాపిరాజు, నాయుడు దుర్గాప్రసాద్, పోసిన గణపతి, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల అభ్యున్నతే లక్ష్యం



రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, ఏవీఏరోడ్డు, న్యూస్‌టుడే: సంచార జాతుల అభ్యున్నతే భాజపా లక్ష్యమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. సంచార, అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరంలో 'స్వాభి' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంచార జాతుల కళాకారులు, భాజపా నాయకులు కలిసి కంబాలచెరువు నుంచి పుష్కరఘాట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పుష్కర ఘాట్ వద్ద ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 'సంచార జాతులు- సంచార వారసులు- సాంస్కృతిక వారధులు' అంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర బేడ (బుడగ) జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం నాగేశ్వరరావు, భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'ఇస్కాన్' వెలుగులు



రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గౌతమఘాట్‌లోని మందిరంలో ఆదివారం మంగళ హారతి, దర్శన హారతి, భాగవత ప్రవచనం, హయగ్రీవ యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సత్యగోపీనాథ్‌దాస్ ప్రభుజీ, ప్రతినిధులు హేమ నిమాయిదాస్, రవీంద్రదాస్, శివానంద నిమాయిదాస్ తదితరులు పర్యవేక్షించారు. వేడుకల సందర్భంగా ఇస్కాన్ మందిరం, పరిసర ప్రాంతాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దొమ్మేటి కృషి అజరామరం

కడియం, న్యూస్‌టుడే: బీసీల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి కృషి చిరస్మరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కొనియాడారు. కడియం మండలం మాధవరాయుడుపాలెం పరిధి గుబ్బలవారిపాలెంలో ఆదివారం ఎమ్మెల్యే గోరంట్లతో కలిసి మంత్రి శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనుక్షణం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా చట్టసభల్లో రిజర్వేషన్లు పెంచే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. దాంతో వారికి మరిన్ని రాజ్యాంగ స్థానాలు పొందే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ శెట్టిబలిజ సంక్షేమానికి అలుపెరుగని పోరాటాలతో ప్రజాహృదయాలను గెలుచుకున్న మహోన్నత వ్యక్తి దొమ్మేటి వెంకటరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమానికి చెల్లుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా మాజీ కార్పొరేటర్ పాలిక శ్రీను విగ్రహ దాతగా వ్యవహరించారు. డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి రఘురామ్, పితాని శివరామకృష్ణ, సానబోయిన వినోద్, గుత్తుల గోవిందు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు

ప్రశాంతంగా 'నీట్'

రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రాజీవ్‌గాంధీ విద్యాసంస్థలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులను ఈ చిత్రంలో చూడొచ్చు.

–ఈనాడు, రాజమహేంద్రవరం



భవన నిర్మాణ పనుల పరిశీలన

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరం కోటిలింగాలపేట సమీప పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రంలో నిర్మిస్తున్న పిండ ప్రధాన భవన నిర్మాణాన్ని ఆదివారం దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ పరిశీలించారు. పుష్కరాలకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అనంతరం ఆయన నగరంలోని ధార్మిక సంస్థలు, పుష్కరఘాట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారని సత్రం సహాయ కమిషనర్ పి.విశ్వనాథరాజు తెలిపారు. కమిషనర్ వెంట దేవాదాయశాఖ ఆర్‌జేసీ వి.త్రినాథరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ టి.దుర్గేష్, జిల్లా దేవాదాయశాఖ అధికారి సుబ్బారావు తదితరులు ఉన్నారు.



కోటిలింగాల సత్రంలో పనులపై ఆరా తీస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్

మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతం

- విగ్రహావిష్కరణలో సభాపతి అయ్యన్నపాత్రుడు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మచ్చలేని మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతమని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ కృష్ణబాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో గామన్ వంతెన కూడలిలో మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. దొమ్మేరులో బస్ స్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆంధ్రా సుగర్స్ సీఎండీ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, కృష్ణబాబు విగ్రహాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కైకలూరు శాసనసభ్యుడు కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభలో 'జమిందారు నుంచి జనం మనిషిగా ఎదిగిన ప్రజానేత' పేరిట ముద్రించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ మంచి, మానవత్వానికి కృష్ణబాబు ప్రతిరూపమన్నారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ ఎంపీలు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడారు. కృష్ణబాబు సోదరుడు, తెదేపా నాయకుడు పెండ్యాల అచ్చిబాబు మాట్లాడుతూ తన అన్న పార్టీలు, కులాలకు అతీతంగా అందరికీ సహాయపడేవారన్నారు. కృష్ణబాబు కుమార్తె అర్చన మాట్లాడుతూ అందరి హృదయాల్లో స్థానం సంపాదించిన మహోన్నత వ్యక్తికి కూతురిగా పుట్టినందుకు గర్వపడుతున్నానని ఉద్వేగానికి లోనయ్యారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా తెదేపా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణచౌదరి, అవంతి సంస్థల అధినేత అల్లూరి ఇంద్రకుమార్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి పీతల సుజాత, జడ్పీ మాజీ ఛైర్మన్లు ఇమ్మణ్ణి రాజేశ్వరి, ముళ్లపూడి బాపిరాజు, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, టీవీ రామారావు, కృష్ణబాబు అల్లుడు, తెదేపా నాయకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, అల్లూరి విక్రమాదిత్య, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కృష్ణబాబు కుటుంబ సభ్యులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో సభాపతి అయ్యన్నపాత్రుడు. చిత్రంలో ఎమ్మెల్యే ముప్పిడి, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

బాటల బాగుకు భరోసా

రూ.873 కోట్లతో మౌలిక వసతుల కల్పన

మండపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయితీల రూపురేఖలను మార్చేందుకు హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) విధానంలో భారీ ప్రాజెక్టు చేపట్టింది. నగరాలు, పట్టణాల్లో ప్రాధాన్యతను బట్టి కేటాయించిన నిధులతో సీసీరోడ్లు, బీటీరోడ్ల నిర్మాణంతో పాటు గుంతలమయంగా మారిన ప్రధాన కాలనీల్లో అంతర్గత రహదారుల స్థానంలో పటిష్ఠమైన డబుల్ లేయర్ బీటీరోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో నాణ్యమైన రోడ్లు నిర్మించనున్నారు. వర్షాకాలంలో రోడ్లపై నీరునిల్వ ఉండకుండా ప్రధాన అవుట్‌లెట్ డ్రెయిన్లను ఆధునీకీకరించనున్నారు. ప్రమాదాలు జరగకుండా కూడళ్ల అభివృద్ధి సెంట్రల్ లైటింగ్, డివైడర్ల అధునికీకరణ, ముఖ్య జంక్షన్ల విస్తరణ, పాదచారులకు కాలిబాటలు నిర్మించనున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 2 కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయితీల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా మిగిలిన రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం రూ.873 కోట్లు మంజూరు చేసింది. పనులను ప్రముఖ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ ఏజెన్సీలకు అప్పగించింది.



మండపేటలో ప్రతిపాదించిన గొల్లపుంత బైపాస్ రోడ్డు

నిర్మాణ సంస్థలు ఇవే..

ఆయా పనులకు సీఏఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎస్‌జీఎస్ ఇంజినీరింగ్ సర్వీసెస్, ఈసీటీ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్, ఎస్ఆర్ కన్సల్టెన్సీ, సత్య అసోసియేషన్ నిర్మాణ సంస్థలుగా వ్యవహరిస్తున్నాయి.

హెచ్ఏఎం విధానంలో..

సాధారణంగా కాంట్రాక్టు విధానంలో పనులకు నిధుల కొరత లేదా ఇతర కారణాలతో అలస్యమయ్యే అవకాశం ఉంటుంది. దీనికి భిన్నంగా హెచ్ఏఎం విధానంలో పనుల్లో నాణ్యత, సమయపాలన, నిర్వాహణ బాధ్యతలను నిర్దేశిత ఏజెన్సీలకు అప్పగిస్తారు. ప్రభుత్వం విడతల వారీగా నిధులు విడుదల చేస్తూ నాణ్యత, ప్రమాణాలను క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీ చేస్తుంది. దీనివల్ల ప్రజాధనం సద్వినియోగంతో పాటు ఏళ్ల తరబడి రోడ్లు, డ్రెయిన్లు పటిష్ఠంగా ఉంటాయి.

పట్టణం/ నగరం	కేటాయించిన నిధులు(రూ.కోట్లలో)
రాజమహేంద్రవరం (కార్పొరేషన్)	300
కాకినాడ (కార్పొరేషన్)	93
పిఠాపురం పట్టణం	200
కొవ్వూరు	50
మండపేట	30
అమలాపురం	25
నిడదవోలు	25
పెద్దాపురం	26
తుని	30
సామర్లకోట	25
రామచంద్రపురం	17
ఏలేశ్వరం నగర పంచాయితీ	20
ముమ్మిడివరం	12
గొల్లప్రోలు	20

టెండర్లు ఖరారయ్యాయి..

అభివృద్ధి పనుల్లో ఆలస్యం చోటుచేసుకోకుండా రాష్ట్ర పురపాలక శాఖ ఏజెన్సీలకు పనులు కేటాయించింది. ఆయా సంస్థలకు పనులు అప్పగించి టెండర్లు ఖరారు చేశారు. నగరాలు, పట్టణాల్లో ప్రతిపాదిత పనులు నెల రోజుల్లో ప్రారంభించే అవకాశం ఉంది.

– శేషగిరి, ఈఈ, ప్రజా ఆరోగ్య శాఖ, రాజమహేంద్రవరం

సాలీడు.. అద్భుత గూడు



సాలీడు కీటకాల వేట కోసం ఉచ్చును అల్లడంలోనే కాదు.. గుడ్లకు రక్షణ కల్పించేందుకు అద్భుత గూడునూ కడుతుంది. ఎండ, వాన, శత్రు కీటకాల నుంచి రక్షణ ఉండేలా ఆకులకు కిందభాగంలో ప్రత్యేక గుడ్ల సంచి(గూడు) తయారు చేస్తుంది. ఇతర జీవులు లోపలికి వెళ్లకుండా నోటి నుంచి వచ్చే సన్నని దారంతో దీనిని రూపొందిస్తుంది. తర్వాత అందులో గుడ్లు పెడుతుంది. సుమారు నెలరోజుల్లో వాటి నుంచి పిల్లలు వస్తాయి. కోరింగ అభయారణ్యానికి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.మహేష్ మాట్లాడుతూ తల్లి జీవి సుమారు 45 రోజులు ఆ గూడులో సుప్తావస్థలో ఉంటుందన్నారు. గుడ్లు, పిల్లల రక్షణకు ఇది అద్భుత రక్షణ కవచం అన్నారు. అమలాపురం మండలం రంగాపురం శివాలయం వద్ద మామిడి చెట్టు ఆకుపై కనిపించిన సాలీడు అల్లిన గూడు ఇది. – న్యూస్‌టుడే, కోనసీమ

దుళ్లలో పట్టపగలే చోరీ

కడియం, న్యూస్‌టుడే: దుళ్ల గ్రామంలో పట్టపగలే భారీ చోరీ కడియం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఎర్రకాలనీలో నివాసం ఉంటున్న మానెం సత్యనారాయణ కుటుంబంతో కలిసి ఆదివారం ఉదయం ఓ శుభకార్యం నిమిత్తం వేములపల్లికి వెళ్లారు. తాళం వేసిన ఇంట్లోకి ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువాలోని పది కాసుల బంగారం, రూ.3.5లక్షల నగదుతో పాటు ఇతర వెండి ఆభరణాలతో ఉడాయించారు. సత్యనారాయణ ఫిర్యాదుతో ఘటనా స్థలిని డీఎస్పీ శివప్రియ, ఎస్సై నాగదుర్గాప్రసాద్ పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శివప్రియ

సుత్తితో కొట్టి.. కాళ్లు, చేతులు కట్టి పడేసి

- ఒంటరి మహిళపై అన్నదమ్ముల హత్యాయత్నం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

కోరుకొండ, కంబాలచెరువు, న్యూస్‌టుడే: పుట్టినరోజు పార్టీకి రమ్మని చెప్పి ఓ మహిళపై అన్నదమ్ములు హత్యాయత్నం చేశారు. సుత్తితో కొట్టి చనిపోయిందని భావించి కాళ్లు, చేతులు కట్టేసి, మెడకు తీగ కట్టి చెత్తలో పడేశారు. ఆమె కొన ఊపిరితో ప్రాణాలతో బయటపడ్డారు. రాజమహేంద్రవరంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన గెడ్డం ధనలక్ష్మి అలియాస్ శాంతి భర్తతో విభేదాలతో తనకు పరిచయమైన మట్టాడి దేవి ప్రసాద్‌తో నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. వీరి సంబంధం ప్రసాద్ సోదరుడు అయ్యప్పకు ఇష్టం లేదు. ఈ విషయంలో అన్నదమ్ములు ఇద్దరూ తరచూ గొడవ పడుతున్నారు. ధనలక్ష్మిని ఎలాగైనా మట్టుబెట్టాలని సోదరులిద్దరూ నిర్ణయించుకున్నారు. ఈనెల 25న అయ్యప్ప పుట్టినరోజు అని చెప్పి రప్పించి ఆమెను హత్య చేయాలని పథకం వేశారు. ఆ రోజు రాత్రి గాడాలలో పుట్టినరోజు పార్టీకి రమ్మనిమని చెప్పడంతో ధనలక్ష్మి వెళ్లారు. అన్నదమ్ములు ఇద్దరూ మద్యం తాగారు. చరవాణి చూస్తూ ధనలక్ష్మి ఆదమరిచి ఉన్న సమయంలో దేవిప్రసాద్ ఆమె చేతులను వెనక్కి లాగి పట్టుకోగా, అయ్యప్ప ఆమె తలపై సుత్తితో విచక్షణా రహితంగా బాదాడు. దీంతో ఆమె స్పృహతప్పి పడిపోయారు. వారు చనిపోయిందని భావించి చేతులు, కాళ్లు కట్టేసి ద్విచక్ర వాహనంపై రాజమహేంద్రవరం క్వారీమార్కెట్ వద్ద డంపింగ్ యార్డులో చెత్తలో పడేసి వెళ్లిపోయారు.

రాత్రంతా చెత్తలోనే..

ఆ రోజు రాత్రి చేతులు, కాళ్లు కట్టేసి ఉన్న ధనలక్ష్మి నిస్సహాయ స్థితిలో మరుసటి రోజు ఉదయం వరకు అక్కడే ఉండిపోయారు. కొన ఊపిరితో ఉన్న ఆమెను పారిశుద్ధ్య కార్మికులు చూసి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ధనలక్ష్మి

కేసు నమోదులో జాప్యం..

ఆమెకు క్యాజువాలిటీలో చికిత్స అందించారు. ఒంటి గంట తరువాత మెడికో లీగల్ కేసు నమోదు చేశారు. దాని తాలూకా వివరాలను జీజీహెచ్ అవుట్‌పోస్టులోని పోలీసులకు సెక్యూరిటీ సిబ్బంది ద్వారా అందజేశారు. అక్కడి నుంచి సంబంధిత స్టేషన్‌కు వివరాలు రాకపోవడంతో ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం జరిగింది. 26న ఎంఎల్‌సీ నమోదైతే 30న కేసు కట్టి నిందితులను అరెస్టు చేశారు. జీజీహెచ్ అవుట్‌పోస్టు పోలీసుస్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తోంది. దీనిపై ఉత్తర మండల డీఎస్పీ జీవన జీజీహెచ్‌కు వచ్చి విచారణ చేశారు.

చికిత్స పొందుతూ ఖైదీ మృతి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే : రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఓ వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను మండలం ఊర్లగొండిప్ప గ్రామానికి చెందిన జే.ఏసుబాబు(57) ఓ హత్య కేసులో నిందితుడిగా ఉండడంతో కోర్టు జీవిత ఖైదు విధించింది. 2019 అక్టోబరు ఏడో తేదీ నుంచి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. హృదయ సంబంధిత అనారోగ్య సమస్యతో బాధపడుతూ మందులు వినియోగిస్తున్నాడు. ఈనెల 25న ఆరోగ్యం క్షీణించడంతో జైలు అధికారులు జీజీహెచ్‌లో చేర్పించారు. 26వ తేదీ నుంచి వెంటిలేటర్‌పై ఉంచి వైద్యులు చికిత్స అందించారు. 29వ తేదీ రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తతే ముఖ్యం..

కడియం, న్యూస్‌టుడే: ఎల్‌నినో కారణంగా వాతావరణంలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. విపరీతమైన ఎండ.. అంతలోనే వర్షం.. మబ్బులు.. గాలులు.. ఇలాంటి వాతావరణంలో త్వరగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి **డా.పి.కోమల** సూచించారు. కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ తరపున ప్రత్యేక చర్యలు చేపడుతున్న చెప్పారు.

వాతావరణ మార్పులతో..

వాతావరణంలో వేగంగా మారుతున్న ఉష్ణోగ్రతలు, తేమతో కొన్నిరకాల వైరస్‌లు, బ్యాక్టీరియాలు వేగంగా వృద్ధి చెందుతాయి. రోగనిరోధకశక్తి తక్కువగా ఉండే వారిపై ప్రభావం చూపుతాయి. వృద్ధుల్లో న్యూమోనియా వచ్చే అవకాశం ఉంది. పిల్లలకు వేగంగా ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది.

పీహెచ్‌సీలకు ఎక్కువగా ఈ కేసులు..

పీహెచ్‌సీలకు డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలతో పాటు డయేరియా, టైఫాయిడ్, లెప్టోస్పిరోసిస్ వంటి వ్యాధుల బారిన పడిన వారు ఎక్కువగా వస్తున్నారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. పూర్తిస్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఈ లక్షణాలతో జాగ్రత్త..

జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, వాంతులు, విరేచనాలు, రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు. జ్వరం రెండు రోజులకు మించి కొనసాగితే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలి.

నియంత్రణకు చర్యలు..

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జ్వర సర్వేలు చేపడుతున్నాం. అనుమానితులకు పరీక్షలు, చికిత్స కొనసాగుతున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. దోమల లార్వా నియంత్రణ, నిల్వ నీటి తొలగింపు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి చెబుతున్నాం. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి.

తనిఖీలు నిర్వహిస్తున్నాం..

అన్నిచోట్లా పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందేలా ఆదేశాలు జారీ చేశాం. పక్కాగా అమలయ్యేలా తనిఖీలు నిర్వహిస్తున్నాం. కొన్నిచోట్ల సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	16,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	23,500
గటగట	21,000
కొత్తకాయ: గండేరా	23,000
గటగట	20,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-21,000
కొత్త (పచ్చి) కాయ	20,000-21,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	257-00

లారీని ఢీకొన్న వ్యాన్: ముగ్గురికి గాయాలు

దేవరపల్లి, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న లారీ హఠాత్తుగా ఆగడంతో వెనుకనున్న ఐషర్ వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు గాయపడగా, రెండేళ్ల బాలుడు సురక్షితంగా బయటపడ్డాడు. ఆదివారం తెల్లవారుజామున దేవరపల్లిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులు, హైవే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. హైదరాబాద్‌లోని చందానగర్ నుంచి ఇంటి సామగ్రితో దంపతులు కండపల్లి సుబ్రహ్మణ్యం, వైష్ణవి తమ రెండేళ్ల కుమారుడు కృష్ణతో కలిసి శనివారం రాత్రి 7 గంటలకు రాజమహేంద్రవరం బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో దేవరపల్లి-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిలో దేవరపల్లి వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీడ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న వ్యాన్ అదుపుతప్పి బలంగా ఢీకొట్టింది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు, డ్రైవర్‌కు గాయాలు కావడంతో తొలుత గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి, తరువాత మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాకినాడకు చెందిన సుబ్రహ్మణ్యం కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువ కావడంతో రాజమహేంద్రవరంలోని ఏదైనా ఆసుపత్రిలో ఉపాధి వెతుక్కునేందుకు ఇంటి సామగ్రి తీసుకుని వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.మనోహర్ తెలిపారు.



ప్రమాదంలో ధ్వంసమైన వ్యాన్

రాజమహేంద్రవరం

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని, నేరాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ సూచించారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే రౌడీషీటర్లకు చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, రవాణాకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు.

ప్రత్యేకాలంకరణలో కోటసత్తెమ్మ

నిడదవోలు, న్యూస్‌టుడే: తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ ఆదివారం ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దర్శనాల టికెట్ల ద్వారా రూ.24,980, అన్నదానం విరాళాలు రూ.8,404, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.25,875, ఇతర టిక్కెట్‌ల ద్వారా రూ.43,119 ఆదాయం వచ్చింది. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్, వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
83282 39927, 80089 02897

సమస్య : మోరంపూడి హనుమాన్ నగర్ ఒకటో వీధిలో గత కొద్ది రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయి.
- రమేష్ , స్థానికుడు

సమాధానం: పరిశీలించి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.
- నగర పాలక కమిషనర్.

సమస్య: మోరంపూడి, బొమ్మూరు, వీఎల్‌పురం, తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద పెరిగింది. వాహన చోదకులను వెంబడించి గాయపరుస్తున్నాయి.
- సుబ్బారావు, వ్యాపారి

సమాధానం: సిబ్బందిని పంపి వీధి కుక్కల్ని పట్టిస్తాం.
- నగర పాలక కమిషనర్.

–న్యూస్‌టుడే, టి.నగర్

ఆక్రమణలు తొలగేనా.. ముంపు తప్పేనా..?

కాలువలపై అక్రమ నిర్మాణాలతో ఇక్కట్లు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలో కాలువలపై ఆక్రమణలు ఎక్కువవడంతో తరచూ ముంపు సమస్య ఏర్పడుతోంది. దీనికితోడు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మురుగు నీటితో పాటు, వరద నీరు ముందుకు ప్రవహించే మార్గం లేక రోడ్డుపైకి చేరుతోంది. ఇటీవల కురిసిన అడపాదడపా వర్షాలకు ఆల్కట్‌గార్డెన్స్, వీఎల్‌పురం, రైల్వేస్టేషన్ సమీప ప్రధాన రహదారులన్నీ నీట మునిగాయి. గతంలో కోరుకొండ రోడ్డులోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. ఇప్పటికైనా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు స్పందించి.. రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆక్రమణలు తొలగించాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.


ఇటీవల వీఎల్‌పురంలో అరకొరగా తొలగింపు పనులు చేపట్టిన సిబ్బంది

కాలువల చుట్టూ..

● ఉభయ గోదావరి జిల్లాలకు ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న రాజమహేంద్రవరంలో వ్యాపార కార్యకలాపాలు జోరుగా సాగుతుంటాయి. దీంతో వ్యాపార ప్రాంతాల్లో కాలువలపై అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్రధాన కాలువలు అయిన నల్లాఛానల్, ఆవ ఛానల్ పరిసరాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ● ఆవ కాలువ చుట్టుపక్కల ఆక్రమణలతో కాలువ వెడల్పు కుదించుకుపోయింది. ఇన్నీసుపేట, కోటిపల్లి బస్టాండ్, ఆవ ప్రాంతం, మోరంపూడి మీదుగా ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద గోదావరిలో కలుస్తుంది. ఆవ కాలువ ద్వారా ఎక్కువ శాతం మురికినీరు ప్రవహిస్తుంది. ● ఇటీవల శివారు ప్రాంతాల్లో భూ క్రయవిక్రయాలు ఎక్కువవడంతో, నూతన నిర్మాణాలకు అడ్డుగా ఉంటున్న కాలువను దశల వారీగా ఆక్రమించేస్తున్నారు. ● దీంతో వర్షాలు కురిసినప్పుడల్లా వీఎల్‌పురం, మోరంపూడి, కృష్ణనగర్, చైతన్యనగర్, సాయిమార్గ్, ప్రధాన రైల్వే స్టేషన్ వెనుక, తూర్పు రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ముంపు ఏర్పడుతోంది. ● రెండేళ్ల కిందట భారీ వర్షాలకు ఆయాచోట్ల దాదాపు 15 రోజులు పాటు నీరు నిలిచిపోయింది. నివాసితులంతా పడవలపై ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఇదీ పరిస్థితి..!

● నగరంలో సుమారు 630 కి.మీ. పొడవులో సాధారణ కాలువలు విస్తరించి ఉన్నాయి. 140 కి.మీ.మేర మధ్యస్థ కాలువలు ఉన్నాయి. కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో మురుగు నీరు బయటకు వెళ్లడం లేదు.

● గతంలో కొన్ని చోట్ల ఆక్రమణలను గుర్తించిన నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేయగా, నివాసితులు కోర్టును ఆశ్రయించారు. దీంతో అరకొరగా నిర్మాణాలు తొలగించి, అధికారులు పట్టించుకోవడం మానేశారు. మెయిన్‌రోడ్డు, కోట గుమ్మం, గోదావరి గట్టు దిగువన ఉన్న ప్రాంతాల్లో కాలువలన్నీ ఆక్రమణల గుప్పిట్లోనే ఉన్నాయి.

● తాడితోట నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా మోరంపూడి వరకు ఉన్న కాలువలపై వ్యాపార సముదాయాలు నిర్మించారు. కంబాలచెరువు, దేవీచౌక్, ప్రకాశంనగర్, దానవాయిపేట, జాంపేట, ఆజాద్‌చౌక్‌లో కాలువలు ఆక్రమణకు గురయ్యాయి.

● ఇప్పటికైనా అధికారులు స్పందించి... ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

టి.నగర్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

1న మెగా ఉద్యోగ మేళా

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే : తాడితోట జంక్షన్ సమీప సంహిత డిగ్రీ కళాశాలలో సెప్టెంబరు 1వ తేదీన మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ తోట రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా ప్రారంభమవుతుందని, 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉన్న నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 76608 23093 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే : నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని చదువుకు ప్రకాశంనగర్ సీఐ బాజీలాల్ తన వంతు సాయం అందించారు. నగరానికి చెందిన సిరికొండ భాను సంజన సూరంపాలెం ఆదిత్య వర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతోంది. సీఐ ఆదివారం ఆమెకు రూ.10 వేలు అందించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే : జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఎంకె చెస్ అకాడమీ ఏపీ స్టేట్ ర్యాంకింగ్ చదరంగం పోటీలు ఆదివారం ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో ఉత్సాహంగా జరిగాయి. అండర్-6, -8, -10, -12, -14, -16 విభాగాల్లో జరిగిన పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అంతర్జాతీయ చెస్ క్రీడాకారులు లంక రవి, ఫ్యూచర్ కిడ్స్ పాఠశాల డైరెక్టర్ వై. రవిబాబు పోటీలను ప్రారంభించారు. ప్రతిభ చూపిన మొదటి పది మంది విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా జి.హేమచంద్రమౌళి, జీవీ.కుమార్ వ్యవహరించగా, జిల్లా చదరంగం సంఘం అధ్యక్షుడు బి.జగదీష్, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.శేషగిరి, సంఘం కార్యదర్శి జీవీఎస్.లక్ష్మి, టోర్నమెంట్ డైరెక్టర్ జి.కార్తీక్ గోపాల్ పాల్గొన్నారు.


విజేతలతో సంఘం సభ్యులు

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, సినీహీరో పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా రాజమహేంద్రవరం మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ వద్ద రక్తదానం శిబిరం నిర్వహించారు. అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. మెగా యూత్ ఫోర్స్ నేషనల్ కన్వీనర్ ఏడిద బాబీ, చిక్కాల ఆనంద్ తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. అభిమానులు ఆంజనేయులు, జానీ, బి.హరీష్ నాయుడు, బి.భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న అభిమానులు

'డీసీసీబీ' పథకాలతో ప్రయోజనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం) ,టి.నగర్, వి.ఎల్.పురం : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అందిస్తున్న వివిధ పథకాలు, వడ్డీ రేట్లు, రుణ సౌకర్యాలపై బ్యాంకు ఉద్యోగుల సంఘం (కాకినాడ యూనిట్) సభ్యులు ఆదివారం రాజమహేంద్రవరంలో అవగాహన కల్పించారు. నగరంలోని వై-జంక్షన్, రైతుబజారు, ఆర్ట్స్ కళాశాల, దానవాయిపేట గాంధీపార్కు, స్థానిక వర్షిప్ సెంటర్ ప్రాంతాల్లో బ్యాంకు సేవలను వివరించారు. పొదుపు పథకాలకు మెరుగైన ప్రయోజనాలు, అధిక భద్రత ఉంటుందని వివరించారు. కర్షక మిత్ర రుణం ద్వారా ఎకరానికి గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం కలదని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీసీబీఈఏ) ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీసీసీబీఈఏ ప్రధాన కార్యదర్శి మిడియం క్రాంతికృష్ణ, డీసీసీబీ ఏజీఎం డి.ఏసుబాబు, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టి.వీరబాబు, రాజమహేంద్రవరం బీఎం జి.లక్ష్మీతులసి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.


దానవాయిపేట గాంధీ పార్కులో ప్రచారానికి హాజరైన ఉద్యోగులు

సంచార జాతుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, ఏవీఏరోడ్డు, న్యూస్‌టుడే : దేశంలో సంచార జాతుల చరిత్రకు ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. సంచార, అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము మాట్లాడారు. సంచార జాతుల కళాకారులు ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణిస్తూ... కళలను, సంప్రదాయాలను, జానపద వారసత్వాన్ని ప్రచారం చేస్తూ, వాటి పరిరక్షణకు కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. సంచార జాతుల హక్కుల పరిరక్షణకు కేంద్రం చర్యలు చేపడుతోందన్నారు. భాజపా నాయకులు బి.దత్తు, కె.సతీష్, కె.సత్యసాయిరామ్, ఎం.నరేష్‌కుమార్, ఏ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వేదికపై కళాకారుల ప్రదర్శన


ర్యాలీలో ఎమ్మెల్సీ వీర్రాజు, భాజపా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర


గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

కడియం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాకతో గ్రామాభివృద్ధికి పెద్దపీట వేసిందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. కడియం మండలం మాధవరాయుడుపాలెంలో ఈబీసీ కల్యాణ మండపం వద్ద రూ.30లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలిసి మంత్రి ప్రారంభించారు. మాజీ సర్పంచి అన్నందేవుల చంటి నేతృత్వంలో స్థానికులు వీరికి స్వాగతం పలికారు. మంత్రి సుభాష్ ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలపై స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వెలుగుబంటి రఘురామ్, డిప్యూటీ ఎంపీడీవో శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ మండలం దోసకాయలపల్లి జీఎస్‌హెచ్ విద్యా సంస్థలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డీఎంహెచ్‌వో పి.కోమల తెలిపారు. విద్యాసంస్థలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న 40 మంది విద్యార్థుల ఆరోగ్య ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఎలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినితోనూ మాట్లాడారు. దోసకాయలపల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తునామని, అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడారు. వంటశాలలో వండుతున్న పదార్థాలను తనిఖీ చేసి సూచనలు చేశారు. వంటగది, వంట పాత్రలు, ఆహారం తయారు చేసే విధానం, తాగునీటి వసతి, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి వీటి జాగ్రత్తలపై సూచనలు చేశారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు


నరసింహశర్మ

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : జానపద సాహిత్యంలో చేసిన కృషికి గుర్తింపుగా రాజమహేంద్రవరానికి చెందిన కవి సన్నిధానం నరసింహశర్మకు 'బిరుదురాజు రామరాజు జానపద విజ్ఞాన పురస్కారం' లభించింది. తెలంగాణలోని జానపద సాహిత్య పరిషత్తు-2026 ఆధ్వర్యంలో పురస్కారానికి ఎంపిక చేసినట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి సీహెచ్.కృష్ణారెడ్డి ప్రకటించారు. అక్టోబరు 2వ తేదీన హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందిస్తారని నరసింహశర్మ తెలిపారు.

నైపుణ్య కోర్సుల్లో ఉచిత ప్రవేశాలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే : జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏ), పేషెంట్ రిలేషన్ అసోసియేట్ నైపుణ్య కోర్సుల్లో ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నామని రాజమహేంద్రవరంలోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఈడీ సీహెచ్.నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎనిమిదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివి, పాస్ లేదా ఫెయిలైన అభ్యర్థులు అర్హులన్నారు. నాలుగు నెలల ఉచిత శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలకు సహకారం అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు నగరంలోని కిమ్స్ ఆసుపత్రి సమీప బొల్లినేని మెడ్‌స్కిల్స్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 73373 62530, 92902 77301 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రోడ్డెక్కిన మురుగు



కొత్తేరు నుంచి కొంతమూరు క్రాస్‌రోడ్డులోని జిల్లా పరిషత్ పాఠశాల మార్గంలో మురుగు నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు నీరు ఇక్కడి కూడలిలో నిలిచిపోతుండడంతో తీవ్ర దుర్వాసన, దోమల బెడద ఎక్కువైంది. రహదారి మొత్తం నాచు పట్టి ఉండడంతో పలువురు జారి పడుతున్నారు. అధికారులు స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏరోడ్డు

ఇసుక పేరుకుపోతోంది

నగరంలో నిత్యం రద్దీగా ఉండే మార్గాల్లో ఒక్కటైన ఐఎల్‌టీడీ వంతెనపై ఇసుక పేరుకుపోవడంతో వాహనచోదకులు జారి పడిపోతున్నారు. ఇసుక లారీల రాకపోకలతో ఐఎల్‌టీడీ కూడలి నుంచి వంతెన మీదుగా రైల్వేక్వార్టర్స్ వరకు సుమారు కిలోమీటరు మేర రహదారిపై ఇసుక పేరుకుపోతోంది. భారీ వాహనాల సమయంలో దుమ్ము, ధూళి గాలిలోకి రేగుతోంది. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏరోడ్డు



ఆదమరిస్తే అంతే..!

లాలాచెరువు కూడలిలో ఉన్న ఇండియన్ బ్యాంక్ వద్ద నడకమార్గంలో సిమెంట్ పలక ధ్వంసమైంది. పెద్ద రంధ్రం ఏర్పడడంతో నిత్యం రాకపోకలు సాగించే పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదమరిస్తే ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని నివాసితులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... వెంటనే మరమ్మతులు చేపట్టి, సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏరోడ్డు



నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

బొమ్మూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు టవర్ లైన్ నిర్మాణ పనుల కారణంగా హుకుంపేట, శాటిలైట్‌సిటీ సబ్‌స్టేషన్‌లకు విద్యుత్తు ప్రత్యామ్నాయంగా ఇవ్వడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. హుకుంపేట, శాటిలైట్‌సిటీలో గ్రామాల్లో సోమవారం విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. రైతులు, గృహ వినియోగదారులు గమనించాలని సూచించారు.

గోదారమ్మకు హారతి వైభోగం



రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరం గోదావరి తీరంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యహారతి వేడుక ఆదివారం వైభవంగా జరిగింది. పుష్కరఘాట్‌లో నూతనంగా నిర్మించిన వేదికపై వేదపండితులు 14 రకాల హారతులను ఒక్కొక్కటిగా నదీమ తల్లికి సమర్పించారు. సెలవు రోజు కావడంతో నగరవాసులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు.

ఐక్య పోరాటాలతో సమస్యల పరిష్కారం

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే : వారానికి ఐదు రోజుల పనిదినాల అమలు, వివాదాస్పద పి.ఎల్.ఐ పథకం ఉపసంహరణ తదితర డిమాండ్ల సాధనకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూ.ఎఫ్.బి.యూ) పిలుపుతో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సామాజిక మాధ్యమాల ద్వారా చేపట్టిన ప్రచారాన్ని విజయవంతం చేయాలని కోరుతూ... ఆదివారం రాజహేంద్రవరం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ (కంబాలచెరువు) వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. డిమాండ్లు పరిష్కరించకుంటే దశల వారీగా ఆందోళనలు చేస్తామన్నారు. ఉద్యోగ సంఘం నాయకులు శేషుకుమార్, పాపారావు, అప్పారావు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ ఉద్యోగులు


ఆర్డీవోకు వినతి ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

పాత విధానంలో టెట్ నిర్వహణ సరికాదు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ విధానంలో మార్పులు చేస్తామని చెప్పి మళ్లీ పాత విధానంలోనే పరీక్ష నిర్వహించడం సమంజసం కాదని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో మెరకవీధి నుంచి ఆర్డీవో కార్యాలయానికి ద్విచక్ర వాహనాలపై ప్రదర్శనగా చేరుకుని ఆర్డీవో కె.ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాలు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు కొన్ని పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని టెట్ విషయంలో మినహాయింపులు ఇస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మాత్రం ఇబ్బందులకు గురిచేసే విధానాన్ని అవలంబిస్తున్నారన్నారు. నాయకులు కె.శ్రీనివాస్, డి.మనోజ్, ఎండీ ఇమ్రాన్‌బాషా, టి.క్రాంతి, బి.శంకర్, పీవీ రవికుమార్, రాజేశ్వరరావు, రవి

అత్యాచారం కేసులో అయిదుగురి అరెస్టు

పాయకాపురం, న్యూస్‌టుడే: విజయవాడ వాంబే కాలనీలో నివాసముంటున్న రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన ఓ మహిళపై జరిగిన అత్యాచారం కేసులో అయిదుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈనెల 29న తెల్లవారుజామున ఈ ఘాతుకం జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ దైవప్రసాద్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘాతుకంలో మరో ముగ్గురు కూడా నిందితులకు సహకరించారని బాధితురాలు ఏసీపీ వద్ద వాపోయింది. దీంతో ఆ ముగ్గురినీ కూడా కేసులో చేర్చారు. బాధితురాలికి షేక్.రెహ్మతుల్లా(24), లింగాల సాయికుమార్(20)తో పరిచయం ఉంది. ఈ నెల 28న రాత్రి ఓ ఇంట్లో జరిగిన పుట్టిన రోజు వేడుకలకు బాధితురాలు, నిందితులు హాజరై మద్యం తాగారు. తెల్లవారుజామున బాధితురాలి ఇంట్లోకి ప్రవేశించి వారిద్దరు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు మరో ముగ్గురు కూడా సహకరించారని తేలింది. వీరి పేర్లను పోలీసులు బయట పెట్టలేదు. నేరంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఇద్దరితో పాటు అందుకు సహకరించిన ముగ్గురిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే : ఒంటరి మహిళ ధనలక్ష్మిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ బర్రె కొండబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలి తండ్రి నాగేశ్వరరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఘటనపై ఎస్పీ, కలెక్టర్ దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కంబాలచెరువు(రాజమహేంద్రవరం) : జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ధనలక్ష్మిని ఆదివారం వైకాపా రాష్ట్ర కార్యదర్శి జి.బాబు పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కొట్లాటపై పరస్పర కేసులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం) : ఇరువర్గాల కొట్లాటకు సంబంధించి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పరస్పర కేసులు నమోదయ్యాయి. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మార్కండేయస్వామి ఆలయం సమీపంలో నివసిస్తున్న షేక్ ముస్తఫా తన ఇంటి పక్కన ఉన్న వెల్డింగ్ దుకాణానికి వచ్చిన వాహనాలను తన గృహం ఎదుట పార్కింగ్ చేస్తున్నారని ప్రశ్నించడానికి వెళ్తే.. తనపై నలుగురు దాడి చేశారని ఫిర్యాదు చేశారు. అయితే షేక్ ముస్తఫా తమ ఇంటికొచ్చి కారు అద్దాలు పగలగొట్టి, మొక్కల కుండీ ధ్వంసం చేసి బెదిరించాడని వెల్డింగ్ దుకాణం ప్రతినిధి గౌతమ్ ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై పరస్పర కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

లోడు లారీ బోల్తా

రాజానగరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై జీపీఆర్ గార్డెన్ సమీపంలో సిమెంటు, కాంక్రీటు మిక్స్‌డ్ లోడు ఉన్న లారీ తిరగబడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర గ్రామానికి చెందిన డ్రైవర్ కేతా శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. హైవే సిబ్బంది అతనిని హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. రాజమహేంద్రవరం వైపు నుంచి వైజాగ్ వైపు వెళ్తుండగా ఈ వాహనం జీపీఆర్ గార్డెన్స్ వచ్చేసరికి అదుపుతప్పి ఎడమ వైపునకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని, నేరాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ సూచించారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... అసాంఘిక కార్య కలాపాల్లో పాల్గొనే రౌడీషీటర్లకు చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, రవాణాకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు.

నైపుణ్య కోర్సుల్లో ఉచిత ప్రవేశాలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏ), పేషెంట్ రిలేషన్ అసోసియేట్ నైపుణ్య కోర్సుల్లో ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నామని రాజమహేంద్రవరంలోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఈడీ సీహెచ్.నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎనిమిదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివి, పాస్ లేదా ఫెయిలైన అభ్యర్థులు అర్హులన్నారు. నాలుగు నెలల ఉచిత శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలకు సహకారం అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు నగరంలోని కిమ్స్ ఆసుపత్రి సమీప బొల్లినేని మెడ్‌స్కిల్స్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 73373 62530, 92902 77301 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పశువులకు నిలయంగా అంగన్‌వాడీ కేంద్రం

• ఏళ్లుగా పూర్తికాని భవన నిర్మాణం





పనులు పూర్తిచేయకపోవడంతో నిరుపయోగంగా మారిన అంగన్‌వాడీ కేంద్రం (అంతర చిత్రం) కేంద్రం భవనంలో గేదెలు

గోకవరం, న్యూస్‌టుడే: ఏళ్లుగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురాకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రం పశువులకు నిలయంగా మారింది. గోకవరం మండలం తంటికొండ గ్రామంలో చిన్నారుల కోసం 12 ఏళ్ల కిందట అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే శ్లాబు వేసి గోడలను నిర్మించి మిగిలిన పనులను పూర్తి చేయకుండా వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మిగిలిన పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించారు. నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని స్థానికులు తమ పశువులు, కోళ్లకు వినియోగించుకుంటున్నారు. ఈ భవనం పూర్తికాకపోవడంతో స్థానికంగా ఉన్న చిన్నపాటి అద్దె ఇంటిలో ఇబ్బందులు పడుతూ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. చిన్నారులు ఆడుకోవాల్సిన అంగన్‌వాడీ కేంద్రం పశువులకు నిలయంగా మారడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి మిగిలిన పనులను పూర్తిచేయించి అంగన్‌వాడీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న అభిమానులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, సినీహీరో పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా రాజమహేంద్రవరం మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ వద్ద రక్తదానం శిబిరం నిర్వహించారు. అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. మెగా యూత్ ఫోర్స్ నేషనల్ కన్వీనర్ ఏడిద బాబీ, చిక్కాల ఆనంద్ తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. అభిమానులు ఆంజనేయులు, జానీ, బి.హరీష్ నాయుడు, బి.భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

లోడు లారీ బోల్తా..



హైవేపై తిరగబడిన వాహనం

రాజానగరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై జీపీఆర్ గార్డెన్ సమీపంలో సిమెంటు, కాంక్రీటు మిక్స్‌డ్ లోడు ఉన్న లారీ తిరగబడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర గ్రామానికి చెందిన డ్రైవర్ కేతా శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. హైవే సిబ్బంది అతనిని హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. రాజమహేంద్రవరం వైపు నుంచి వైజాగ్ వైపు వెళ్తుండగా ఈ వాహనం జీపీఆర్ గార్డెన్స్ వచ్చేసరికి అదుపుతప్పి ఎడమవైపునకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ఆ సమయంలో వాహనాలు లేకపోవడం, అక్కడ మనుషులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతరం.. సేవాభావం

రాజానగరం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ముఖ్య ఉద్దేశం. రాజానగరానికి చెందిన పలువురు విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు.

నాయకత్వానికి ప్రతీక..



ఎన్ఎస్ఎస్ వాలంటీరుగా, ఈగల్ క్లబ్ సభ్యురాలిగా, సేవ్ ఎనర్జీ క్యాంప్ అంబాసిడర్‌గా సామాజిక సేవలో పాల్గొంటున్నా. మాదకద్రవ్య రహిత సమాజం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలుగా నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. రాష్ట్రస్థాయిలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వికసిత్ భారత్ యంగ్ యూత్ డైలాగ్ కార్యక్రమంలో పాల్గొన్నా. ఆగస్టు 7న గైట్ ఫార్మసీలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో వ్యాఖ్యాతగా వ్యవహరించాను. ముంబయిలో నిర్వహించిన కార్యక్రమంలో వాలంటీరు హీరో అవార్డును అందుకున్నా.

- ఏ.పావని, బీ.ఫార్మసీ, 4వ సంవత్సరం

శిక్షణలో పలు అవార్డులు



సామాజిక సేవా కార్యక్రమాలకు సంబంధించి వాలంటీర్లకు శిక్షణ ఇప్పించడంలో ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ ఎన్ఎస్ఎస్ పీవో అవార్డు అందుకున్నాను. బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు లభించింది. ఉత్తమ కమ్యూనిటీ బిల్డర్ అవార్డు అందుకున్నాను.

- షేక్ మీరా, ఎన్ఎస్ఎస్ ప్రతినిధి

జాతీయస్థాయిలో పాల్గొన్నా..



పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, సుపరిపాలన, వ్యక్తిత్వ వికాసం ద్వారా సమాజ సేవ వంటి అంశాల్లో చురుగ్గా పాల్గొంటున్నా. యూనిసెఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించి స్కూల్ ఇన్నోవేటివ్ ఛాలెంజ్ కార్యక్రమంలో మూడు నెలలు వాలంటీరుగా సేవలందించాను. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ నిర్వహించిన ప్రజాతంత్ర నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్నా. దిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఫైనల్‌కు చేరుకున్నా. రాజమహేంద్రవరం నగర అభివృద్ధి, సుపరిపాలనకు సంబంధించి సిటీ ప్లానర్ ఐడియాస్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అంశంపై ప్రణాళిక రూపొందించా. వాలంటీరుగా చేసిన వివిధ కార్యక్రమాలకు ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ వాలంటీరుగా అవార్డు అందుకున్నా.

- జి.సాయి శశాంక్, ఫార్మ్-డీ 6వ సంవత్సరం



రోడ్డు ప్రారంభంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గోరంట్ల

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

కడియం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రామాభివృద్ధికి పెద్దపీట వేసిందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. కడియం మండలం మాధవరాయుడుపాలెంలో ఈబీసీ కల్యాణ మండపం వద్ద రూ.30లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలిసి మంత్రి ప్రారంభించారు. మాజీ సర్పంచి అన్నందేవుల చంటి నేతృత్వంలో స్థానికులు వీరికి స్వాగతం పలికారు. మంత్రి సుభాష్ ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలపై స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వెలుగుబంటి రఘురామ్, డిప్యూటీ ఎంపీడీవో శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ వీరయ్యగౌడ్

సైబర్ మోసాలతో అప్రమత్తం

రాజానగరం: రాజానగరం పోలీసు స్టేషన్ పరిధిలోని బ్రిడ్జికౌంటీలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది చేపట్టారు. కొత్తగా ఎవరైనా ప్రవేశిస్తున్నారా? అనుమానిత కదలికలు ఉంటే తమకు తెలియజేయాలని సీఐ తెలిపారు. సైబర్ మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. చరవాణి ఉపయోగించడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలతో గౌరవంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వి.వి.సత్యనారాయణ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

బొమ్మూరు: విద్యుత్తు టవర్ లైన్ నిర్మాణ పనుల కారణంగా హుకుంపేట, శాటిలైట్‌సిటీ సబ్‌స్టేషన్‌లకు విద్యుత్తు ప్రత్యామ్నాయంగా ఇవ్వడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యుల్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. హుకుంపేట, శాటిలైట్‌సిటీలో గ్రామాల్లో సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. రైతులు, గృహ వినియోగదారులు గమనించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు	ధవళేశ్వరం: 91212 29057	కడియం: 91212 29062
	బొమ్మూరు: 91549 78039	మోరంపూడి: 94935 92696
	రాజానగరం: 98492 36167	కోరుకొండ: 80085 74213

తాగునీరు వస్తుంది..

స్పందనకు వందనం

రాజవోలు చర్చి వీధిలో పైపు పగిలి నీరు వృథాగా పోతోంది. నివాసాలకు నీరు రాకపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను కార్యదర్శి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి మరమ్మతులు చేయించారు. తాగునీరు సరఫరా అవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వీధి దీపాలు వెలగక..

సమస్య: బొమ్మూరు నేతాజీనగర్ 10వ వీధిలో వీధి దీపం మూడు రోజుల నుంచి వెలగడం లేదు. మరమ్మతులు చేసినా పరిస్థితి మారడం లేదు.

– కార్తీక్, స్థానికుడు

సమాధానం: కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం.

– కాశీ, కార్యదర్శి, బొమ్మూరు

సమస్య: కోరుకొండలో కుక్కలు విపరీతంగా పెరిగాయి. వాహన చోదకులపై పడి గాయపరుస్తున్నాయి. తమ పిల్లలను రహదారి పైకి పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. – కె.స్వామి, గ్రామస్థుడు

సమాధానం: కుక్కలు ఎక్కువగా ఉన్న సంగతి మా దృష్టికి వచ్చింది. ఉన్నత అధికారులకు తెలియజేసి, వాటిని పట్టించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. – నాగరత్నం, కోరుకొండ కార్యదర్శి – న్యూస్‌టుడే, కోరుకొండ

ఐక్య పోరాటాలతో సమస్యల పరిష్కారం

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే : వారానికి ఐదు రోజుల పనిదినాల అమలు, వివాదాస్పద పి.ఎల్.ఐ పథకం ఉపసంహరణ తదితర డిమాండ్ల సాధనకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూ.ఎఫ్.బి.యూ) పిలుపుతో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సామాజిక మాధ్యమాల ద్వారా చేపట్టిన ప్రచారాన్ని విజయవంతం చేయాలని కోరుతూ... ఆదివారం రాజమహేంద్రవరం ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ (కంబాలచెరువు) వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. డిమాండ్లు పరిష్కరించకుంటే దశల వారీగా ఆందోళనలు చేస్తామన్నారు.

అధ్వానంగా రహదారి



రోడ్డు పక్కనే చెత్తను నిల్వ చేయడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గోకవరం నుంచి చిన్నూరు వెళ్లే దారిలో సంజీవయ్యనగర్ శివారున, ఆర్అండ్ఆర్ కాలనీల వద్ద రోడ్డు పక్కనే చెత్తను నిల్వ చేస్తున్నారు. పొలాలకు వెళ్లే రైతులతో పాటు ఆర్అండ్ఆర్ కాలనీ వాసులు, చిన్నూరు వెళ్లేవారు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డు పక్కనే చెత్తను నిల్వ చేయడంతో ఈ ప్రాంతాలు పూర్తిగా అపరిశుభ్రంగా మారి దుర్వాసనను వెదజల్లుతున్నాయి. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టి ఈ చెత్తను పూర్తిగా తొలగించి శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గోకవరం

శిథిల భవనాలు.. గంజాయి ముఠాలకు అడ్డాలు



మండల సమావేశం నిర్వహించే భవనం లోపల ఇలా..



వ్యవసాయ శాఖ కార్యాలయం

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో గతంలో వివిధ కార్యాలయాలుగా ఉపయోగించిన భవనాలు నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కొత్తభవనాలు నిర్మించడంతో పాతవాటిని వదిలేశారు. అవి గంజాయి బ్యాచ్‌లకు నిలయాలుగా మారాయి. వీరు తరుచూ పడుతున్నారు. స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఆదివారం నలుగురు కొట్టుకోగా ఒకరు గాయపడ్డారు. అతనిని ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. 1981లో ఓ ప్రభుత్వ భవనాన్ని నిర్మించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు ఇందులోనే జరిగేవి. అనంతరం నూతన భవనం కట్టడంతో దీనిని వదిలేశారు. ఆ తర్వాత కొంత కాలం వెలుగు కార్యాలయాన్ని నిర్వహించారు. దానికి కూడా కొత్త భవనం రావడంతో నిర్లక్ష్యానికి గురైంది. తలుపులు లేక, చెత్తా, చెదారంతో నిండిపోయింది. పాములు, విష కీటకాలకు నిలయంగా మారింది. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న మూడు భవనాలను తొలగించి ఆ ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు. అసాంఘిక శక్తుల కార్యకలాపాలకు అడ్డాగా మారుతుండటంతో ఆందోళనగా ఉందని స్థానికులు వాపోతున్నారు.



శిబిరంలో వైద్యులు, పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం

గోకవరం, న్యూస్‌టుడే: పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. పాఠశాల పూర్వవిద్యార్థి డా.కాటన్‌తో పాటు ఆయన వెంట వచ్చిన ఇతర వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాలలో ఔషధాలు, ఇంజెక్షన్లను నిల్వ చేసేందుకు వీలుగా రూ. 20 వేలు విలువైన రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. విద్యార్థులు ఆడుకునేందుకు రూ.32 వేలు విలువైన క్రీడా సామగ్రిని అందించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సృజన్, కార్యదర్శి శ్రీనివాస్, ఇతర సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంచిన నిత్యావసర ధరలను తగ్గించాలి



రైతు కూలీ సంఘం నాయకుల నిరసన

గోకవరం, న్యూస్‌టుడే: పెంచిన నిత్యావసర ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆం.ప్ర.రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. రంపయర్రంపాలెం గ్రామంలో ఆదివారం చేపట్టిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ.. కూలీ పనులు లేక రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరో పక్క ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నాయన్నారు. పేదలు ఒక పూట తింటే మరో పూట పస్తులు ఉంటున్నారన్నారు. ప్రభుత్వాలు చర్యలు చేపట్టి పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి కె.సతీష్, గోలి ముసలయ్య, చింతపల్లి ముసలయ్య, నరసమ్మ, వీరరాఘవ, లక్ష్మీ, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో సంఘం సభ్యులు

ఉత్సాహంగా చదరంగం పోటీలు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే : జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఎంకె చెస్ అకాడమీ ఏపీ స్టేట్ ర్యాంకింగ్ చదరంగం పోటీలు ఆదివారం ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో ఉత్సాహంగా జరిగాయి. అండర్-6, -8, -10, -12, -14, -16 విభాగాల్లో జరిగిన పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అంతర్జాతీయ చెస్ క్రీడాకారులు లంక రవి, ఫ్యూచర్ కిడ్స్ పాఠశాల డైరెక్టర్ వై. రవిబాబు పోటీలను ప్రారంభించారు. ప్రతిభ చూపిన మొదటి పది మంది విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా జి.హేమ చంద్రమౌళి, జీవీ.కుమార్ వ్యవహరించగా, జిల్లా చదరంగం సంఘం అధ్యక్షుడు బి.జగదీష్, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.శేషగిరి, సంఘం కార్యదర్శి జీవీఎన్.లక్ష్మి, టోర్నమెంట్ డైరెక్టర్ జి.కార్తీక్ గోపాల్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..



జాతీయ రహదారి పక్కన కల్వర్టుపై రంధ్రం పడి ప్రమాదకరంగా మారింది. కవలగొయ్యి గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో హైవేను ఆనుకుని ఉండటంతో అటుగా ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ రద్దీ సమయాల్లో ఇక్కడ చాలా సమయం ట్రాఫిక్ నిలిచిపోతోంది. రాత్రిపూట దానిని గుర్తించని వాహన చోదకులు పడిపోతున్నారు. దీనిని సరిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, మోరంపూడి(బొమ్మూరు)

నిలకడగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి



చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ మండలం దోసకాయలపల్లి జీఎస్‌హెచ్ విద్యాసంస్థలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డీఎంహెచ్‌వో పి.కోమల తెలిపారు. విద్యాసంస్థలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న 40 మంది విద్యార్థుల ఆరోగ్య ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఎలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినితోనూ మాట్లాడారు. దోసకాయలపల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని, అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడారు. వంటశాలలో వండుతున్న పదార్థాలను తనిఖీ చేసి సూచనలు చేశారు. వంటగది, వంట పాత్రలు, ఆహారం తయారు చేసే విధానం, తాగునీటి వసతి, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి వీటి జాగ్రత్తలపై సూచనలు చేశారు.

అత్యాచారం కేసులో అయిదుగురి అరెస్టు

పాయకాపురం, న్యూస్‌టుడే: విజయవాడ వాంబే కాలనీలో నివసిస్తున్న రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన ఓ మహిళపై జరిగిన అత్యాచారం కేసులో అయిదుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈనెల 29న తెల్లవారుజామున ఈ ఘాతుకం జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ దైవప్రసాద్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘాతుకంలో మరో ముగ్గురు కూడా నిందితులకు సహకరించారని బాధితురాలు ఏసీపీ వద్ద వాపోయారు. దీంతో ఆ ముగ్గురినీ కూడా కేసులో చేర్చారు. బాధితురాలికి షేక్.రెహ్మతుల్లా(24), లింగాల సాయికుమార్(20)తో పరిచయం ఉంది. ఈ నెల 28న రాత్రి ఓ ఇంట్లో జరిగిన పుట్టిన రోజు వేడుకలకు బాధితురాలు, నిందితులు హాజరై మద్యం తాగారు. తెల్లవారుజామున బాధితురాలి ఇంట్లోకి ప్రవేశించి వారిద్దరు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు మరో ముగ్గురు కూడా సహకరించారని తేలింది. వీరి పేర్లను పోలీసులు బయట పెట్టలేదు. నేరంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఇద్దరితో పాటు అందుకు సహకరించిన ముగ్గురిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చనున్నట్లు సున్న పోలీసులు తెలిపారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

వాసవీ కన్యకా పరమేశ్వరి గ్రామోత్సవం



ఊరేగింపులో భక్తులు

నల్లజర్ల, న్యూస్‌టుడే: దూబచర్లలో ఆదివారం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ప్రత్యేక వాహనంపై మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య సామాజిక భవనం వద్ద ఉదయం 10.49 గంటలకు అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు దూబచర్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చీమకుర్తి కిశోర్ తెలిపారు.

ప్రత్యేకాలంకరణలో కోటసత్తెమ్మ



నిడదవోలు, న్యూస్‌టుడే: తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ ఆదివారం ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దర్శనాల టికెట్ల ద్వారా రూ.24,980, అన్నదానం విరాళాలు రూ.8,404, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.25,875, ఇతర టికెట్ల ద్వారా రూ.43,119 ఆదాయం వచ్చింది. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ పర్యవేక్షించారు.

కేంద్ర పథకాలతో గ్రామాభివృద్ధి



టీవీలో వీక్షిస్తున్న భాజపా నాయకులు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి ఎంతో ప్రయోజనకరమని భాజపా నాయకుడు బూరుగుపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం టీవీలో ప్రసారమైన ఈ కార్యక్రమాన్ని ఉండ్రాజవరంలో నాయకులు వీక్షించారు. స్వచ్ఛ భారత్, పుణ్యక్షేత్రాలు, పల్లెల అభివృద్ధిపై చర్చించారు. నాయకులు ఆకిన గోపాలకృష్ణ, ఆకెళ్ల శ్రీనివాసరావు, ఏలేశ్వరపు నారాయణ, మద్దిపాటి వెంకటేశ్వర్లు, కాళీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497
నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

సమస్య: గోష్పద క్షేత్రం పొద వనం సుందరీకరణ గట్టుపై ఉద్యాన వనంలో పిచ్చిమొక్కలు మొలిచి విష పురుగులు సంచరిస్తున్నాయి. వర్షం వస్తే ఆ ప్రదేశమంతా బురదగా మారుతోంది. - కె.రాజా, కొవ్వూరు

సమాధానం: తుప్పలను తొలగించి సమస్య పరిష్కరించే చర్యలు తీసుకుంటాం. - జె.సందీప్, పురపాలక కమిషనర్, కొవ్వూరు

- న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

మహర్షి విగ్రహం దిమ్మె ఏర్పాటుకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

నిడదవోలు: గోదావరి కాటన్ ఆనకట్టపై విజ్జేశ్వరం ఆర్మ్ వద్ద వశిష్ఠ గోదావరి పాయ ప్రవహించే ప్రాంతంలో ఒరిగిన వశిష్ఠ మహర్షి విగ్రహం దిమ్మెను తొలగించి కొత్తది ఏర్పాటు చేసి విగ్రహాన్ని పెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 'ఒరుగుతున్న వశిష్ఠ మహర్షి విగ్రహం దిమ్మె' శీర్షికన గత నెల 28న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై మంత్రి కందుల దుర్గేష్ స్పందించారు. అదేరోజు విగ్రహ ప్రాంతాన్ని పరిశీలించి దిమ్మెను సరిచేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు దిమ్మెను తొలగించి నిర్మాణ పనులు చేపట్టారు.

మెట్ల వద్ద దిగకుండా అడ్డుకట్ట

నిడదవోలు: నిడదవోలు ఆర్వోబీ మెట్లు సగానికిపైగా విరిగిపోయి ప్రమాదకరంగా ఉండటంతోపాటు, మెట్లు ఉన్న స్తంభం కింది భాగం దెబ్బతినడంతో అధికారులు ఆదివారం అక్కడ రేకులు అడ్డుగా ఏర్పాటు చేశారు. 'విరిగిన మెట్లు.. జరభద్రం' శీర్షికన గత నెల 27న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి స్పందించి మెట్ల మీదుగా దిగకుండా చర్యలు తీసుకున్నారు.

గుర్రపుడెక్క నిర్మూలన మందు పిచికారీ

ఉండ్రాజవరం: మండలంలో దమ్మెన్ను నుంచి ఉండ్రాజవరం, పాలంగి, చివటం మీదుగా తణుకు వరకు విస్తరించిన ప్రధాన మురుగు కాలువలో గుర్రపుడెక్క, తూడు అలముకుని మురుగు ముందుకెళ్లని సమస్యపై 'తూడు తొలగదు.. మురుగు పారదు' శీర్షికన ఈ నెల 28న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డ్రెయినేజీ శాఖ ఆధ్వర్యంలో పాలంగి, తదితర ప్రాంతాల్లోని కాలువల్లో గుర్రపు డెక్క, తూడు నిర్మూలనకు మందు పిచికారీ చేయించారు.

చిరు ప్రోత్సాహం.. ప్రతిభకు పట్టం

న్యూస్‌టుడే, తాళ్లపూడి, గోపాలపురం: మట్టిలో మాణిక్యాలను ప్రోత్సహించేందుకు మేము సైతం అంటూ పూర్వ విద్యార్థులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి సాయం చేస్తున్నారు. పాఠశాలల్లో వసతులు కల్పించడంతోపాటు చదువుల్లో ప్రతిభ చూపుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు పురస్కారాలు అందిస్తున్నారు. గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లోని కొవ్వూరు, తాళ్లపూడి మండలాల పరిధిలో ప్రతిభావంతులకు ఉన్నత విద్యకు బాసటగా నిలుస్తున్నారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఆర్థికసాయం అందిస్తున్నారు. గోపాలపురం మండలంలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు నాతాని స్వచ్ఛంద సంస్థ ఏటా రూ.25 వేలు చొప్పున అందిస్తోంది. ◆ గోపాలపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ఎం.వెంకటరావు పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థికి రూ.10 వేలు ప్రోత్సాహం అందిస్తున్నారు. ◆ జగన్నాథపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి అల్లూరి గంగరాజు రూ.25 వేలు, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి కోడూరి వెంకటరమణారావు రూ.10 వేలు చొప్పున గత 15 ఏళ్లుగా నగదు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ◆ తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం కేజీబీవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సంఘంగా ఏర్పడి విద్యార్థులను ఆదుకునేందుకు తమ వంతు సాయం చేస్తున్నారు. సంఘం నుంచి రూ.3 లక్షలు, పూర్వ విద్యార్థి కందుల సత్యం రూ.లక్ష, దాత ఎస్.నాగలక్ష్మి రూ.లక్ష మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేసి, దీనిపై వచ్చిన వడ్డీ, పూర్వ విద్యార్థుల నెలవారీ విరాళాలతో మొత్తంగా ఉపకార వేతనాలు అందిస్తున్నారు.

ఉపకార వేతనాలు..

ఐదేళ్లుగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో ప్రతిభ చూపిన 14 మంది విద్యార్థులకు సుమారు రూ.80 వేలు అందజేస్తున్నారు. పూర్వవిద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఫ్యాన్లు సైతం అందించారు. ఇప్పటి వరకు సుమారు రూ.5 లక్షలు ఉపకారవేతనం ఇచ్చారు. దాతలు అందిస్తున్న సాయాన్ని తమ ఉన్నత చదువులకు, భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకుంటున్నామని పలువురు విద్యార్థులు తెలిపారు.

నగదు బహుమతి అందుకున్నా..



చదువులో ప్రతిభ చూపినందుకు నగదు బహుమతి ఇచ్చారు. తోటి విద్యార్థులతో పోటీ పడి చదివి మంచి మార్కులు సాధించా. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నగదు బహుమతి అందజేశారు. ఈ మొత్తాన్ని జ్ఞాపకంగా దాచుకుంటా. ఉన్నతంగా రాణించిన తర్వాత నేను కూడా మరికొంత మందికి సాయం చేస్తా. - డి.కిరణ్, పదో తరగతి విద్యార్థి

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుర్తింపు..



ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులంతా చదువులో రాణించిన వారికి సాయం చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు లక్షల్లో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి గుర్తింపు వస్తోంది. దాతలు అందిస్తున్న ప్రోత్సాహం చాలా విలువైంది. - రాగమయి, పూజిత, విద్యార్థినులు, ఎనిమిదో తరగతి

నేడు విద్యుత్తు సరఫరా నిలుపుదల

నిడదవోలు, న్యూస్‌టుడే: తాడిమళ్ల వ్యవసాయ ఫీడర్ పనుల్లో భాగంగా నూతన విద్యుత్తు లైన్ ఏర్పాటు నిమిత్తం ఈ నెల 31న విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నిడదవోలు డివిజన్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. తాడిమళ్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పాక్షికంగా ఫీడర్‌కు విద్యుత్తు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ● కాటకోటేశ్వరం ఉపకేంద్రం పరిధిలో సూరాపురం-యర్నగూడెం రోడ్డులో నూతన విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా 31న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శంకరాపురం, రావిమెట్ల, లింగంపల్లి, తిమ్మరాజుపాలెం, సూరాపురం గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదని నిడదవోలు డివిజన్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు.

పాత విధానంలో 'టెట్' నిర్వహణ సరికాదు



కొవ్వూరు ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ విధానంలో మార్పులు చేస్తామని చెప్పి మళ్లీ పాత విధానంలోనే పరీక్ష నిర్వహించడం సమంజసం కాదని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో మెరక వీధి నుంచి ఆర్డీవో కార్యాలయానికి ద్విచక్ర వాహనాలపై ప్రదర్శనగా చేరుకుని ఆర్డీవో కె.ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాలు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని టెట్ విషయంలో మినహాయింపులు ఇస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మాత్రం ఇబ్బందులకు గురిచేసే విధానాన్ని అవలంబిస్తున్నారన్నారు. నాయకులు కె.శ్రీనివాస్, డి.మనోజ్, ఎండీ ఇమ్రాన్ బాషా, టి.క్రాంతి, బి.శంకర్, పీవీ రవికుమార్, రాజేశ్వరరావు, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామోపాధ్యాయినికి పురస్కారం



విజయలక్ష్మిని అభినందిస్తున్న డీఈవో వాసుదేవరావు, తదితరులు

చాగల్లు, న్యూస్‌టుడే: 2025-26కుగాను ఎస్‌జీఎఫ్‌లో చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎక్కువ మంది రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో వ్యాయామ ఉపాధ్యాయిని విజయలక్ష్మికి స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు దక్కిందని ప్రధానోపాధ్యాయిని ఎస్.వాసవి తెలిపారు. ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, యోగా, హాకీ, క్రికెట్ తదితర పోటీల్లో 48 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. 231 పాయింట్లు సాధించిన ఆమెకు రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు అవార్డు అందజేశారన్నారు.

వృద్ధాశ్రమానికి పంకాలు అందజేత

నిడదవోలు: నిడదవోలు రోటరీ సెంట్రల్ ఆధ్వర్యంలో పట్టణంలోని లింగంపల్లిలో ఉన్న రోటరీ వృద్ధాశ్రమానికి కొండేపాటి శ్రీరామమూర్తి తన కుమారుడు భానుప్రకాష్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పంకాలు అందించారు. నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నీరుకొండ సుబ్రహ్మణ్యం, క్లబ్ కార్యదర్శి దాపర్తి ప్రభాకర్, అధ్యక్షుడు కంఠమణి గోపాలకృష్ణ, రోటరీ సెంట్రల్ సభ్యుడు మాచర్ల మధుసూదనరావు పాల్గొన్నారు.

గోదారమ్మకు హారతి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గోదావరి తీరంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య హారతి వేడుక ఆదివారం వైభవంగా జరిగింది. పుష్కరఘాట్‌లో నూతనంగా నిర్మించిన వేదికపై వేదపండితులు 14 రకాల హారతులను ఒక్కొక్కటిగా నదీమ తల్లికి సమర్పించారు. నగరవాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

తెదేపా హయాంలోనే సంక్షేమం, అభివృద్ధి



నిడదవోలులో ప్రచారం చేస్తున్న కొమ్మిన, శ్రేణులు

నిడదవోలు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలోనే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని తెదేపా నిడదవోలు పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. నిడదవోలు పట్టణంలోని బూత్ నం-32 పరిధిలో రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం-ఇంటింటా తెదేపా కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు అందజేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పట్టణ తెదేపా ప్రధానకార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, నాయకులు బైపే రాజేశ్వరరావు, ఆమతి శ్రీనివాస్, సిలబోయిన వెంకటరమణ, దేవళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి తదితర గ్రామాల్లో రెండేళ్ల నమ్మకం.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఆదివారం కూటమి నాయకులు ఇంటింటా పర్యటించారు. చేపట్టిన అభివృద్ధి పనులు, పథకాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామ అధ్యక్షుడు ఈదృగంటి ఉదయ్‌కుమార్, నాయకులు కేతా రామారావు, కొడమంచిలి ఏసోబు, బొక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పాలంగిలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

విరిగిన గోడ.. కొరవడిన రక్షణ



ఉండ్రాజవరం మండలం తీపర్రు, వడ్లూరు రహదారిలో ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన గోడలు దెబ్బతిన్నాయి. కమ్మెలు విరిగిపోవడంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పితే నేరుగా కాలువలోకి దూసుకుపోయే పరిస్థితులు నెలకొన్నాయి. వాలు రోడ్డు వద్ద కోతకు గురైంది. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ర.జు ఏఈ శ్రీనివాసు తెలిపారు. - న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

రహదారి పక్కన తుప్పలతో ఇక్కట్లు



నిడదవోలు మండలం సమిశ్రగూడెం నుంచి విజ్జేశ్వరం వరకు ఉన్న ర.భ.శాఖ ప్రధాన రహదారి పక్కన పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ పొడవునా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల తుప్పలు రహదారి అంచులపై కమ్ముకోవడంతో మలుపుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారి పక్కన పిచ్చిమొక్కలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నిడదవోలు

అసలే మలుపు.. ఆపై అంచు ఇలా..



రాజమహేంద్రవరం నుంచి నిడదవోలు వచ్చే రహదారిలో విజ్జేశ్వరం పెండ్యాల పంపింగ్ స్కీం మలుపు వద్ద రోడ్డు అంచు ప్రమాదకరంగా ఉంది. సిమెంట్ రహదారి నిర్మించినా.. మలుపులో రోడ్డు మార్జిన్ దిగిపోవడంతో ద్విచక్ర వాహన చోదకులు జారి పడుతున్నారు. నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం, తణుకు, పాలకొల్లు, పెనుగొండ, పెరవలి తదితర మండలాల నుంచి నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. - న్యూస్‌టుడే, నిడదవోలు

భారీగా నిలిచిన ట్రాఫిక్



నిడదవోలు: విజ్జేశ్వరం బ్యారేజీ వద్ద ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు వెళ్లే విషయంలో ఏర్పడిన వివాదం కారణంగా వాటిని రహదారిపై నిలిపివేయడంతో భారీగా ట్రాఫిక్ నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిడదవోలు వైపు పెండ్యాల పంపింగ్ స్కీం, ధవళేశ్వరం వైపు విజ్జేశ్వరం కాటన్ ఆనకట్ట ఆర్మ్, కొవ్వూరు వైపు పడవల లాకు వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఇతర వాహన చోదకులు సర్దిచెప్పగా రహదారిపై అడ్డుగా ఉన్న కార్లను తొలగించడంతో ట్రాఫిక్ సజావుగా సాగింది.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: విశాఖ జిల్లా భీమిలి మండలం గొల్లల తాళ్లవలస పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం రాత్రి కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కంఠమణి తరుణ్ కుమార్(19) ఆదివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యువకుడు తరుణ్‌కుమార్ సంగివలసలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. శనివారం రాత్రి సంగివలస తిరిగి వస్తుండగా ఆనందపురం-తగరపువలస జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో ప్రమాదం జరిగింది. నగరంలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. అతడి స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం, వేలివెన్ను అని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ దివాకర్ చెప్పారు.

చికిత్స పొందుతూ ఒడిశా వాసి మృతి

నల్లజర్ల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా పుట్టాసింగ్ పోస్ట్ గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ మండల్ ఆదివారం మృతి చెందారు. దూబచర్ల జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఎన్‌హెచ్ భద్రతా వాహనాన్ని వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో భద్రతా వ్యాన్‌లో ఉన్న సంతోష్‌కుమార్ తలకు బలమైన గాయమైంది. అదే వాహనంలో ఉన్న బిహార్ రాష్ట్రానికి చెందిన సురజ్‌కుమార్, అల్లూరి సీతారామరాజు జిల్లా వీరభద్రపురం గ్రామానికి చెందిన పందిరి రాజేశ్‌కు గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నారు. డీసీఎం వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు నల్లజర్ల ఎస్సై ఆంజనేయబాబు తెలిపారు.

పోక్సో కేసు నిందితుడికి రిమాండ్

నల్లజర్ల: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి తాడేపల్లిగూడెం కోర్టుకు తరలించగా 15 రోజులు రిమాండ్ నిమిత్తం ఏలూరు జిల్లా జైలుకు తరలించినట్లు నల్లజర్ల సీఐ రవికుమార్ తెలిపారు. మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కొక్కిరిపాటి కిరణ్‌పై శనివారం నల్లజర్ల పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

పెరవలి, న్యూస్‌టుడే: పెరవలికి చెందిన తన భార్య సవరపు రమాదేవి కనిపించడం లేదని భర్త సవరపు శ్రీనివాసు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై అలెగ్జాండర్ తెలిపారు. పెరవలి కూడలిలో మంచినీరు తేవడానికి ఉదయం వెళ్లి వచ్చేసరికి తన భార్య ఇంటి వద్ద లేదని, చుట్టుపక్కల అంతా గాలించినా ఆచూకీ తెలియలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాటకోటేశ్వరంలో యువకుడు..

నిడదవోలు: కాటకోటేశ్వరానికి చెందిన యువకుడు రాజమహేంద్రవరపు నాగదుర్గాప్రసాద్ అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై బాలాజీ సుందరరావు తెలిపారు. ఈ నెల 14న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



బహుమతులతో విజేతలు, నిర్వాహకులు

చాగల్లు, న్యూస్‌టుడే: అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు యోగా గురువు జె.గణేష్ తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన పోటీల్లో ఆర్టిస్టిక్ విభాగాల్లో బాల, బాలికల జట్లు ద్వితీయ స్థానం సాధించాయన్నారు. ఒక్కో జట్టుకు రూ.25 వేల నగదు బహుమతితోపాటు పతకాలు అందించారన్నారు. బాలికల జట్టులో మనోజ, సాయి, శ్రీప్రసన్న, సుప్రజ, హేమశ్రీ, బాలుర జట్టులో ధనరాజ్, వినయ్, శ్యామ్, జయంత్, పృథ్వి ఉన్నారన్నారు. విజేతలకు శాప్ ఛైర్మన్ రవినాయుడు, తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆదివారం బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని వాసవి, తదితరులు అభినందించారు.

భాజపా నేత మురళీకృష్ణకు సత్కారం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన పిల్లలమర్రి మురళీకృష్ణను కొవ్వూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. పురుషోత్తమరామ మందిరంలో సంఘ అధ్యక్షుడు రంగావఝల భూషణశర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ గతంలో బ్రాహ్మణ సంఘ అధ్యక్షునిగా, కౌన్సిలరుగా మురళీకృష్ణ సేవలందించారని కొనియాడారు. మురళీకృష్ణ, వనజ దంపతులను సత్కరించారు. విద్యాపీఠం కార్యదర్శి టీఎన్‌వీ రమణమూర్తి, పురోహిత సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వారణాసి హనుమంతశర్మ, శనివారపు భరద్వాజసాయి, యశ్వంత్‌శర్మ, జీబీవీ సుబ్రహ్మణ్యం, డీఆర్ఎస్ఎన్ శాస్త్రి పాల్గొన్నారు.



మురళీకృష్ణ దంపతులను సన్మానిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘ నాయకులు, ప్రముఖులు

గోశాల ప్రారంభం



గోపూజ చేస్తున్న కిరణ్‌శర్మ

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండలంలోని తాడిపర్రులో కోడూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో వేంకటేశ్వర సప్త గోకులం గోశాలను ఆదివారం ప్రారంభించారు. వేదమంత్రాలు, వాయిద్యాల సందడిలో గోపూజ, హోమాలు, పూజలు నిర్వహించారు. పలువురు పండితులు, భక్తులు పాల్గొన్నారు.

చింతాలమ్మ చెరువులో తూడు తొలగింపు



పెరవలి, న్యూస్‌టుడే: తీపర్రు చింతాలమ్మ చెరువులో తూడు తొలగింపు పనులు చేపట్టారు. తదేకం ఫౌండేషన్ 2027లో జరిగే పుష్కరాలకు తీపర్రు గ్రామాన్ని దత్తత తీసుకుంది. గ్రామంలో పరిసరాల శుభ్రతతోపాటు భూగర్భజలాల నీటిమట్టం పెంచడానికి పలు సామూహిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని చెరువుల్లో తూడు, చెత్త తొలగించే పనులు చేపట్టారు. ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేసి, చెరువు చుట్టూ ఆహ్లాదకర నడకదారితో పార్కు వాతావరణం కల్పించనున్నారు.

మానవత సభ్యత్వ నమోదు వేగవంతం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మానవత సంస్థ వెయ్యి సభ్యత్వాల నమోదు లక్ష్యానికి చేరుకునేలా సభ్యులంతా సహకరించాలని సంస్థ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య కోరారు. తాళ్లపూడిలో మానవత సంస్థ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సంస్థ నిర్వహించే పలు సేవా కార్యక్రమాలపై చర్చించారు. మండల గౌరవ ఛైర్మన్ జనార్దనరావు, మండల అధ్యక్షుడు తైలం పోశారావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం.. మేధో వికాసం

● విద్యార్థులకు చెకుముకి పోటీలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో మూఢనమ్మకాలను పోగొట్టి వైజ్ఞానికంగా తీర్చిదిద్దేందుకు జన విజ్ఞాన వేదిక (జేవీవీ) కృషి చేస్తోంది. విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని వెలికితీసి సైన్స్‌పై ఆసక్తిని పెంచేలా పాఠశాలల్లో సైన్స్ సంబరాలకు సిద్ధమైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహిస్తోంది. కొవ్వూరు డివిజన్ పరిధిలో ప్రాథమిక 331, ప్రాథమికోన్నత 11, ఉన్నత పాఠశాలలు 93 ఉన్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు 34,139 మంది చదువుతున్నారు.

నాలుగు స్థాయిల్లో..

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు చెకుముకి పోటీలను నాలుగు స్థాయిల్లో నిర్వహిస్తారు. పాఠశాల స్థాయిలో తరగతులవారీగా పోటీలు ఈ నెలాఖరుతో ముగియనున్నాయి. సెప్టెంబరు 11న మండల స్థాయి, 27న జిల్లా స్థాయి, నవంబరు 1న రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారు.

విజేతలకు కిట్లు..

ఒక పాఠశాల నుంచి ఒక జట్టుకు మాత్రమే అవకాశం ఉంటుంది. జిల్లాస్థాయి విజేతలుగా నిలిచిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు సైన్స్ శాస్త్రవేత్తలకు సంబంధించిన పుస్తకాలు, ఆసక్తిని రేకెత్తించే ప్రయోగాలు, సైన్స్ కిట్లను బహుమతులుగా అందజేస్తారు.

ఈ సబ్జెక్టుల్లో పట్టు ఉంటే..

విద్యార్థులు 8, 9, 10 తరగతులకు చెందిన గణితం, సైన్స్‌తోపాటు జనరల్ నాలెడ్జికి సంబంధించిన ప్రశ్నలపై పట్టు సాధించాలి. ఇచ్చిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. జట్టులో సమన్వయం ఉంటే విజేతలుగా నిలవగలరు.

ప్రోత్సహిస్తే రాణిస్తారు..

చెకుముకి సైన్స్ సంబరాలకు విద్యార్థులను ప్రోత్సహించాలి. ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. ఎక్కువ మంది పాల్గొనేలా, అన్నిస్థాయిల్లో పోటీలకు హాజరై సత్తా చాటేలా చూడాలి. - వై.పైడియ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు, జన విజ్ఞాన వేదిక

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

కడియం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రామ వికాసానికి పెద్దపీట వేసిందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. కడియం మండలం మాధవరాయుడుపాలెంలో ఈవీవీస్ కల్యాణ మండపం వద్ద రూ.30లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలిసి మంత్రి ప్రారంభించారు. మాజీ సర్పంచ్ అన్నందేవుల చంటి నేతృత్వంలో స్థానికులు వీరికి స్వాగతం పలికారు. మంత్రి సుభాష్ ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలపై స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వెలుగుబంటి రఘురామ్, డిప్యూటీ ఎంపీడీవో శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట

•మండపేట •అనపర్తి

నైపుణ్య కోర్సుల్లో ఉచిత ప్రవేశాలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏ), పేషెంట్ రిలేషన్ అసోసియేట్ నైపుణ్య కోర్సుల్లో ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నామని రాజమహేంద్రవరంలోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఈడీ సీహెచ్.నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎనిమిదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివి, పాస్ లేదా ఫెయిలైన అభ్యర్థులు అర్హులన్నారు. నాలుగు నెలల ఉచిత శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలకు సహకారం అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు నగరంలోని కిమ్స్ ఆసుపత్రి సమీప బొల్లినేని మెడ్‌స్కిల్స్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 73373 62530, 92902 77301 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ సేవలు ప్రశంసనీయం

కాజులూరు, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. ఆదివారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా జనసేన పార్టీ నాయకులు అన్నం గోవింద సేవలు స్మరించుకుని ఆయన జ్ఞాపకార్థం కుమారుడు, ప్రవాస భారతీయుడు అన్నం శ్రీరామచంద్రమూర్తి ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరం, మెగా వైద్య శిబిరం, కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒకరు చేసే రక్తదానంతో పది మంది ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కూటమి నేతలు పోలిశెట్టి చంద్రశేఖర్, గంధం పల్లంరాజు, అక్కల రిశ్వంత్‌రాయ్, చల్లా లక్ష్మి, జన సైనికులు, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో సత్యం, కూటమి నాయకులు

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

మండపేట, ద్వారపూడి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. రెండేళ్ల పాలనలో భాగంగా ఆదివారం కేశవరం గ్రామంలో ఎమ్మెల్యే ఇంటింటా పర్యటించారు. అభివృద్ధి పనులను స్థానికులకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రూ.3.95 కోట్లతో నిర్మించిన సీసీ రహదారి, రూ.11 లక్షలతో నిర్మించిన డబ్ల్యూబీఎం రోడ్డు, రూ.72.26 లక్షలతో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యపు వాటర్ ట్యాంకును ప్రారంభించారు. మరో రూ.70 లక్షలతో నిర్మించే సీసీ రహదారికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏపీఐడీసీ ఛైర్మన్ లీలాకృష్ణతో కలిసి ప్రారంభించారు.


మహిళలకు నీటి బిందె అందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

తెదేపాలో చేరిక..: కేశవరం గ్రామానికి చెందిన పలువురు వైకాపా కార్యకర్తలు ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో తెదేపాలో చేరారు. వీరిలో కరెడ్ల నాగరాజు, దుడ్ల నాగేశ్వరరావు, పేకేటి నాగేశ్వరరావు తదితరులు మండల తెదేపా అధ్యక్షుడు కర్రి తాతారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ తెదేపా నాయకులు, కంటిపూడి శ్రీను, యరగతపు బాబ్జి తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి రోజూ పీజీఆర్ఎస్

బిక్కవోలు, న్యూస్‌టుడే: ప్రతి స్వర్ణ గ్రామ పంచాయతీ సిబ్బంది మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలని డిప్యూటీ ఎంపీడీవో వై.మునేశ్వరరావు తెలిపారు. ఆయా సమయాల్లో ప్రజల నుంచి అర్జీలు వస్తే స్వీకరించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అదే సమయంలో స్వర్ణ పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉండాలని, ప్రతి రోజూ పీజీఆర్ఎస్‌లానే పరిగణించాలన్నారు.

కుంగిన సిమెంట్ రహదారి

మండపేట పట్టణంలోని కలువపువ్వు సెంటర్‌లో ఓ ఫ్యాన్సీ దుకాణం ముందు డ్రైనేజీ పక్కనే సిమెంట్ రహదారి కుంగిపోయింది. అడుగు లోతు వరకు గొయ్యి పడింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పాటు కాలువలో మురుగు నీరు చేరి గుంత విస్తరిస్తోంది. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని వివరించారు. - న్యూస్‌టుడే, మండపేట



పింఛనుదారుల ఫోన్ నంబర్లు తీసుకోండి

బిక్కవోలు, న్యూస్‌టుడే: సామాజిక పింఛనుదారుల ఫోన్ నంబర్లు సక్రమంగా నమోదు చేయాలని ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఐవీఆర్ఎస్ కాల్స్ చేసినప్పుడు పింఛనుదారులకు కాకుండా వేరే వ్యక్తులకు ఫోన్లు వెళ్తున్నాయని, వారు ఆయా సమాచారం ఇవ్వలేకపోతున్నారని తెలిపారు. ఈ కారణంగా పింఛన్లు అందించే సమయంలోనే వారి నుంచి ఫోన్ నంబర్లు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ లబ్ధిదారుల వద్ద చరవాణి లేకపోతే దగ్గర బంధువుల నంబర్లు సేకరించాలని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి ఆదివారం రాత్రి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. అనపర్తికి చెందిన రామారెడ్డి పనిపై వెళ్లి తిరిగి వస్తుండగా ఉపకేంద్రం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది మురళీకృష్ణ, ఆనంద్ బాధితుడిని అనపర్తిలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం రాజమహేంద్రవరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు సమాచారం. ఘటనపై పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు.

కాలువలో వ్యక్తి గల్లంతు..?

బిక్కవోలు, న్యూస్‌టుడే: కొమరిపాలెంలోని కాలువలో పడి ఓ వ్యక్తి గల్లంతయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో కాకినాడ కాలువను ఆనుకుని ఓ మోటార్ సైకిల్ ఉండడంతో ఎవరైనా జారిపడ్డారా.. ఆత్మహత్య చేసుకున్నారా అని కొందరు వెతికారు. బైక్ పందలపాక గ్రామానికి చెందిన వ్యక్తిది కావడంతో పందలపాకలోని కాలువ వద్ద స్థానికులు గుమిగూడారు. గ్రామస్థులు తెలిపిన సమాచారం ప్రకారం.. మోటార్‌సైకిల్ పడి ఉన్న చోట చరవాణి రింగ్ అవుతుండగా కొందరు యువకులు పరిసరాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కాలువ నిండుగా ప్రవహిస్తోంది. కాలుజారి పడిన వ్యక్తి ప్రవాహంలో చిక్కుకుని గల్లంతయినట్లు భావిస్తున్నారు. ఎస్సై రవిచంద్రకుమార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

వ్యక్తిపై దాడి.. మహిళకు వేధింపులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: కొమరిపాలెం గ్రామానికి చెందిన ఓ వివాహితను వేధిస్తూ.. ఆమె తండ్రిని కర్రతో కొట్టి గాయపరచిన ఘటనపై బిక్కవోలు పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. కొమరిపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి కొడుకు, కుమార్తె ఉండగా కుమార్తెకు వివాహం చేశారు. భర్తతో వివాదాల కారణంగా ఆమె పుట్టింట్లోనే ఉంటోంది. ఈమె సోదరుడి స్నేహితుడు ఆమె ఇంటికి వచ్చి అసభ్యంగా ప్రవర్తించడం, ఫోన్‌చేసి వేధించడంతో ఆమె అతని నంబరుని బ్లాక్ చేసింది. దీంతో అతను ఆమె ఇంటికి వచ్చి ఆమె తల్లితో గొడవపడ్డాడు. తండ్రి అడ్డుకుని ప్రశ్నించగా వారిని దూషించి కర్రతో దాడికి పాల్పడ్డాడు. బాధితుడిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంతో ఆదివారం కేసు నమోదుచేసినట్లు ఎస్సై రవిచంద్రకుమార్ తెలిపారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాకారమే లక్ష్యం

హెల్త్ క్లినిక్‌లకు భవనాల నిర్మాణం

అనపర్తి, బిక్కవోలు, న్యూస్‌టుడే: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా చేపట్టిన హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో అన్ని చోట్ల క్లినిక్‌లకు భవన నిర్మాణాలు ప్రారంభించారు. బిక్కవోలు మండలంలోని ఇల్లపల్లి గ్రామంలో ఒకటి, బిక్కవోలు జగనన్న కాలనీలో మరొకటి, అనపర్తి మండలం పెడపర్తిలో ఒకటి, రంగంపేట మండలం ఒడిశలేరులో ఒకటి చొప్పున క్లినిక్‌లు మంజూరయ్యాయి.

భవన నిర్మాణానికి రూ.36 లక్షలు..

ఒక్కో భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.36 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్లినిక్‌లు లేక గ్రామీణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సరి చేసేందుకు ఈ నిధులను వెచ్చించి అన్ని సదుపాయాలతో భవనాలు నిర్మిస్తున్నారు. అద్దె భవనాలు, వివిధ అవసరాలతో ఖాళీ చేసిన ప్రభుత్వ భవనాల్లో ప్రస్తుతం వీటిని నిర్వహిస్తున్నారు. ఆయా చోట్ల పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడానికి సరైన సౌకర్యాలు లేక సిబ్బంది, రోగులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా నిర్మించే హెల్త్ క్లినిక్‌ల భవనాలను మెరుగైన వైద్యం అందించేందుకు అనువుగా తీర్చిదిద్దుతున్నారు. ☛ ఇల్లపల్లిలో భవన నిర్మాణం బేస్‌మెంట్ వరకు వచ్చింది. ఈ గ్రామం బిక్కవోలుకు ఓ మూలన ఉంటుంది. మెరుగైన రవాణా సౌకర్యం కూడా ఉండదు. ఈ నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. భవన నిర్మాణం పూర్తయితే గ్రామస్థులకు ఆరోగ్య సమస్యలు క్రమంగా తగ్గుతాయని భావిస్తున్నారు. ఈ భవనాన్ని నవంబర్ నెలాఖరుకు అందుబాటులోకి తీసుకువస్తామని డీఈఈ అచ్యుతరామారెడ్డి చెప్పారు.

☛ బిక్కవోలు జగనన్నకాలనీలో కూడా భవన నిర్మాణాన్ని నవంబర్ నెలాఖరుకు పూర్తి చేస్తామని డీఈఈ వివరించారు. ఇక్కడ హెల్త్ క్లినిక్ అందుబాటులోకి వస్తే కాలనీవాసులతో పాటు, ఎస్సీకాలనీ వారికి కూడా వైద్యం అందుబాటులోకి వస్తుంది.

☛ రంగంపేట మండలం ఒడిశలేరులో నిర్మిస్తున్న భవనం స్లాబ్ నిర్మాణం పూర్తి చేశారు. వచ్చే అక్టోబర్ నాటికి ఇది అందుబాటులోకి రానుంది.

☛ అనపర్తి మండలం పెడపర్తిలో భవన నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చొరవతో ఆయా గ్రామాల్లో భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


ఇల్లపల్లిలో నిర్మాణంలో ఉన్న భవనం

'సొంత మీడియా అడ్డుపెట్టుకుని బురద జల్లుతున్నారు'

మండపేట, న్యూస్‌టుడే: సొంత మీడియాను అడ్డుపెట్టుకుని తనపై బురద జల్లుతున్నారని, అల్లర్లు సృష్టించి అసత్య కథనాలు ప్రసారం చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనపై తప్పుడు కథనాలు ప్రచారం చేస్తే న్యాయ పోరాటం చేసి తగిన విధంగా బుద్ధిచెబుతానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పుష్కరాల అభివృద్ధి పనుల పేరుతో పేదల ఇళ్లు తొలగించానని ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. ఇళ్లు తొలగించిన 14 కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆశ్రయం కల్పించిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. సాధారణ రోజుల్లోనే పెదకాలువ వద్ద గోదావరి పంటకాలువలో పుణ్యస్నానాలు భక్తులు ఆచరిస్తారని, ఇక పుష్కరాల సమయంలో వందల సంఖ్యలో భక్తులు తరలివస్తారని పేర్కొన్నారు.

వినాయక ఆలయానికి వెండి పాలవెల్లి

రాయవరం, న్యూస్‌టుడే: పసలపూడిలోని లక్ష్మీగణపతి వినాయక ఆలయానికి దాతలు రెండున్నర కేజీల వెండి పాలవెల్లిని బహూకరించారు. ఆదివారం ఉదయం దాతలు చిన్నం గంగిరెడ్డి, బుల్లమ్మాయి, చిన్నం రమేష్, భవానీ దంపతులు వెండి పాలవెల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ స్వగృహం నుంచి వేద మంత్రోచ్చారణలు, బాజా భజంత్రీల మధ్య పాలవెల్లిని ఊరేగింపుగా ఆలయానికి తరలించారు. వినాయక చవితి ప్రత్యేక పూజల్లో వెండి పాలవెల్లిని వివిధ పండ్లతో అలంకరించాలని దాతలు కోరడంతో ఆలయ నిర్వాహకులు ఆమోదం తెలిపారు. దీని విలువ రూ.6 లక్షల ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


వెండి పాలవెల్లిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తున్న దాతలు

సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండలం జి.మామిడాడలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రేజేటి వెంకట నరసింహాచార్యులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ఆలయ ప్రాంగణంలో దంపతులు స్వామివారి అష్టోత్తరనామాలతో పూజలు చేశారు. భక్తులు సమర్పించిన వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపించారు. పలువురు భక్తులు సూర్య నమస్కారాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదం అందించారు.


జి.మామిడాడ సూర్యనారాయణస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చవితి నవరాత్రోత్సవాలకు శ్రీకారం

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగరలో ఆదిగణపతి, సంత మార్కెట్ సెంటర్‌లోని సిద్ధి వినాయక స్వామివార్ల చవితి నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి రాట ముహూర్తం చేశారు. సెప్టెంబరు 14 నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, మహా అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమాల్లో పెద్దింశెట్టి సూర్యచంద్రరావు, మేడేపల్లి కొండ, గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఆది గణపతి ఆలయం వద్ద రాట కార్యక్రమంలో కమిటీ సభ్యులు


స్థానికులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ వీరయ్యగౌడ్

సైబర్ మోసాలతో అప్రమత్తం

రాజానగరం: రాజానగరం పోలీసుస్టేషన్ పరిధిలోని బ్రిడ్జికౌంటీలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది చేపట్టారు. కొత్తగా ఎవరైనా ప్రవేశిస్తున్నారా? అనుమానిత కదలికలు ఉంటే తమకు తెలియజేయాలని సీఐ తెలిపారు. సైబర్ మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. చరవాణి ఉపయోగించడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలతో గౌరవంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వి.వి.సత్యనారాయణ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుతుకులూరులో మన్‌కీ బాత్ వీక్షణ

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని అనపర్తి మండలం కుతుకులూరులో ఆదివారం భాజపా నాయకులు వీక్షించారు. ఎంపీటీసీ సభ్యుడు సత్తి దొరయ్యరెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన ప్రసార కార్యక్రమంలో పార్టీ నాయకులతో పాటు గ్రామస్థులు మోదీ ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకించారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, నాయకులు గొల్లు హేమతులసి, గిరడా గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భాజపా నాయకులు

కాలిబాటపై వ్యాపారం

● అక్రమ వసూళ్ల పర్వం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణంలో కాలిబాటలను కొందరు ఆక్రమించి వ్యాపార నిర్వహణకు అద్దెలకు ఇస్తున్నారు. ఆయా చోట్ల వివిధ వ్యాపారాలు చేస్తున్నవారు నిర్వాహకులకు అద్దెలు చెల్లించడంతో పాటు ఆశీలు పేరిట కొంత, స్థానిక పోలీసులకు మరికొంత ఇచ్చుకోవాల్సిందే. ఇలా ఒక్కో వ్యాపారి నుంచి రోజుకు రూ.150 వరకు పురపాలక ఆశీలు పాటదారులు.. పోలీసులు.. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపార నిర్వహణకు అద్దెకు ఇచ్చిన వ్యక్తి దోచుకుంటున్నారు.

పురపాలక సంఘం గుర్తింపు పొందిన వీధి వ్యాపారులు 246 మంది ఉండగా ఎలాంటి గుర్తింపు లేకుండా అనధికారికంగా వ్యాపారం చేస్తున్నవారు మరో 230 మంది ఉన్నారు. పట్టణంలోని ప్రధానరోడ్డు పొడవునా రెండు కిలోమీటర్ల వరకు ఇరువైపులా వీరు అనధికారికంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద మూడు తోపుడుబళ్లు పెట్టి ఒకరు, ఏరియా ఆసుపత్రి ఎదురుగా నాలుగు బళ్లపై మరొకరు, కృత్తివెంటి పేర్రాజు పంతులు ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల ఎదుట మరికొందరు వ్యాపారాలు చేస్తున్నారు.


ఫుట్‌పాత్‌పై గుడారాలు వేసిన వీధి వ్యాపారులు

కమిషనర్, సీఐ ఏమన్నారు..

కాలిబాటల ఆక్రమణలు, అక్రమ వసూళ్లపై మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజును వివరణ కోరగా పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగిస్తామన్నారు. సీఐ వెంకటనారాయణను వివరణ కోరగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే వ్యాపారాలను వెంటనే తొలగిస్తామన్నారు. పురపాలక సంఘం అధికారులు తొలగింపు ప్రక్రియను ఎప్పుడు ప్రారంభించినా బందోబస్తు కల్పిస్తామన్నారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న అభిమానులు

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, సినీహీరో పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా రాజమహేంద్రవరం మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. మెగా యూత్ ఫోర్స్ నేషనల్ కన్వీనర్ ఏడిద బాబీ, చిక్కాల ఆనంద్ తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. అభిమానులు ఆంజనేయులు, జానీ, బి.హరీష్ నాయుడు, బి.భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే : జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఎంకె చెస్ అకాడమీ ఏపీ స్టేట్ ర్యాంకింగ్ చదరంగం పోటీలు ఆదివారం ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో ఉత్సాహంగా జరిగాయి. అండర్-6, -8, -10, -12, -14, -16 విభాగాల్లో జరిగిన పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అంతర్జాతీయ చెస్ క్రీడాకారులు లంక రవి, ఫ్యూచర్ కిడ్స్ పాఠశాల డైరెక్టర్ వై.రవిబాబు పోటీలను ప్రారంభించారు. ప్రతిభ చూపిన మొదటి పది మంది విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా జి.హేమచంద్ర మౌళి, జీవీ.కుమార్ వ్యవహరించగా, జిల్లా చదరంగం సంఘం అధ్యక్షుడు బి.జగదీష్, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.శేషగిరి, సంఘం కార్యదర్శి జీవీఎన్.లక్ష్మి, టోర్నమెంట్ డైరెక్టర్ జి.కార్తీక్ గోపాల్ పాల్గొన్నారు.



విజేతలతో సంఘం సభ్యులు

నిలకడగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి

కోరుకొండ: కోరుకొండ మండలం దోసకాయలపల్లి జీఎస్‌హెచ్ విద్యా సంస్థలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డీఎంహెచ్‌వో పి.కోమల తెలిపారు. విద్యాసంస్థలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న 40 మంది విద్యార్థుల ఆరోగ్య ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఎలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినితోనూ మాట్లాడారు. దోసకాయలపల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తునామని, అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడారు. వంటశాలలో వండుతున్న పదార్థాలను తనిఖీ చేసి సూచనలు చేశారు. వంటగది, వంట పాత్రలు, ఆహారం తయారు చేసే విధానం, తాగునీటి వసతి, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు.


చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

ఐక్య పోరాటాలతో సమస్యల పరిష్కారం

ఏవీఏ రోడ్డు: వారానికి ఐదు రోజుల పనిదినాల అమలు, వివాదాస్పద పి.ఎల్.ఐ పథకం ఉపసంహరణ తదితర డిమాండ్ల సాధనకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూ.ఎఫ్.బి.యూ) పిలుపుతో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సామాజిక మాధ్యమాల ద్వారా చేపట్టిన ప్రచారాన్ని విజయవంతం చేయాలని కోరుతూ... ఆదివారం రాజమహేంద్రవరం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ (కంబాల చెరువు) వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

1న మెగా ఉద్యోగ మేళా

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే : తాడితోట జంక్షన్ సమీప సంహిత డిగ్రీ కళాశాలలో సెప్టెంబరు 1వ తేదీన మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ తోట రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా ప్రారంభమవుతుందని, 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉన్న నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 76608 23093 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

మెట్ట.. మత్తులో జోగుతోంది..!

☛ జోరుగా నాటుసారా తయారీ

☛ విస్తృతంగా బెల్ట్‌షాపుల నిర్వహణ

రంగంపేట, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లాలో మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలోని పలు గ్రామాలు మత్తులో జోగుతున్నాయి. విచ్చలవిడిగా నాటుసారా తయారీ.. మద్యం గొలుసు దుకాణాల జోరు కొనసాగుతోంది. బహిరంగంగా కనిపిస్తున్నా పాలకులు, సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. నాటుసారా తయారీదారులకు అధికారుల మద్దతు అనధికారికంగా ఉండడంతో కార్యకలాపాలు అడ్డూఅదుపూ లేకుండా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అధిక ధరలకు విక్రయాలు..

మద్యానికి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. రంగంపేట మండలంలో అధికారిక మద్యం దుకాణాల్లో అనధికార ధరల్లో మద్యం విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నాయి. గ్రామాల్లో రెండు, మూడు గొలుసు దుకాణాలు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కోటపాడులోని ఏడీబీరోడ్డు జంక్షన్‌లోనే గొలుసు దుకాణం నిత్యం మందుబాబులతో కళకళలాడుతుంది. దొడ్డిగుంట, సింగంపల్లి, ముకుందవరం, జి.దొంతమూరు, ఈలకొలనులలో విచ్చలవిడిగా నాటుసారా తయారీ, విక్రయాలు సాగుతున్నాయి. ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలతో సారా తయారు చేస్తుండడంతో దాన్ని తాగి పలువురు అనారోగ్యానికి గురవుతున్నారు.

● మర్రిపూడిలో గతంలో సారా తయారీకి వ్యతిరేకంగా ఉద్యమించి సారాను పూర్తిగా అరికట్టగా ఆ తర్వాత సారా వ్యాపారులు యథావిధిగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో మహిళలు ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ సీఐ సుధను 'న్యూస్‌టుడే' వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.